https://epaper.dksaardyamlochaatimpu.com

E-mail: dkchaatimpu80@gmail.com RNI. NO. APTEL/2008/26737

డీకే నారద్యంలో చాటింపు

తెలంగాణ దిన పత్రిక



హైదరాబాద్ సంపుటి : 18 సంచిక : 49 ఎడిటర్ : పూసాల శ్రీనివాస్ శుక్రవారం,నవంబర్,20, 2026 పేజీలు : 8 వెల : రూ.1/-

సిద్ధిపేటకు సీఎం వరాల జల్లు

రూ.544.11కోట్ల అభివృద్ధి పనులకు రేవంత్ శంకుస్థాపనలు

యంగ్‌ఇండియా స్కూళ్లకు శంకుస్థాపన - 6 తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకు భూమిపూజ-విద్యుత్‌సబ్ స్టేషన్ల ప్రారంభోత్సవం

సిద్ధిపేట, నవంబర్ 19:
సిద్ధిపేటలో సీఎం రేవంత్ రెడ్డి గురువారం సిద్ధిపేటలో పర్యటించారు. ఈ సందర్భంగా రూ. 544. 11 కోట్ల అభివృద్ధి పనులను సీఎం రేవంత్ ప్రారంభించారు. అలాగే, రూ. 451.13 కోట్లఅభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఇందిరమ్మ బీమా పథకాన్ని కూడా ప్రారంభించారు. దుబ్బాక, సిద్ధిపేటలో రూ. 200 కోట్లతో నిర్మించనున్నయంగ్ ఇండియా స్కూళ్లకు శంకుస్థాపన చేశారు. అలాగే 6 తహసీల్దార్ కార్యాలయాల నిర్మాణాలకూ భూమిపూజ చేశారు. 14 విద్యుత్ సబ్ స్టేషన్లను కూడా సీఎం ప్రారంభించారు. సాయంత్రం ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సిద్ధిపేట అభివృద్ధి కోసం రూ. 550 కోట్లు ఖర్చుచేస్తున్నామని చెప్పారు. ఇవాళ్టి నుంచి సిద్ధిపేట గడ్డ కాంగ్రెస్ అడ్డా అని తమ కార్యకర్తలు నిరూపించారనిపేర్కొన్నారు. సిద్ధిపేట అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. తెలంగాణ తొలి దశ ఉద్యమంలో కీలకమైన మదన్‌మోహన్‌ను అందరం స్మరించుకోవాలన్నారు. మదన్‌మోహన్‌పేరు లేకుండా చేయాలని మాజీ సీఎం కేసీఆర్ కుట్రపన్నారని ఆరోపించారు. సిద్ధిపేట మెడికల్ కాలేజీకి మదన్‌మోహన్ పేరు పెడతామని తెలిపారు. ఈ సందర్భంగా కేసీఆర్‌పై ఆయన నిప్పులు చెరిగారు. మోసమే కేసీఆర్ పెట్టుబడి అని విమర్శించారు. 2004లో హరీష్‌రావు వార్డు మెంబర్ కూడా కాదన్నారు. ‘గజ్వేల్ గడ్డపై కాలు పెడతా.. కాంగ్రెస్ జెండా ఎగరేస్తానని అప్పుడు చెప్పా. ఇచ్చిన మాటకు కట్టుబడి ఇందిరమ్మ పాలన తెచ్చాం. 2029 లో రెండోసారి కూడా రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంతెస్తాం’ అని రేవంత్ పేర్కొన్నారు. కాగా ఈ సభకు భారీగా జనం హాజరయ్యారు. కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలతో సీఎం కరచాలనం చేస్తూ శ్రేణులను ఉత్సాహపరిచారు. సిద్ధిపేట పోరాటాల అడ్డా అని టీపీసీసీ అధ్యక్షుడు, శాసన మండలి సభ్యుడు మహేష్ గౌడ్ అన్నారు.కొంతమంది ప్రాజెక్టుల పేరిట సిద్ధిపేటను దోచుకున్నారని బీఆర్ఎస్‌ను ఆయన విమర్శిం చారు. త్వరలో సిద్ధిపేటలో బీఆర్ఎస్ కోటలుబద్దలు కాబోతున్నాయని అన్నారు. సిరిసిల్ల లోనూ కాంగ్రెస్ జైత్రయాత్ర ప్రారంభమైందన్నారు. ఇకపై ఒకే కుటుంబం ఆధిపత్యం నడవదని అన్నారు. అన్ని వర్గాలకూ కాంగ్రెస్ తోనే న్యాయం జరుగుతుందన్నారు.





చెన్నైలో రూ.710 కోట్ల విలువైన డ్రగ్స్ స్వాధీనం..

దేశంలో డ్రగ్స్ అక్రమ రవాణాపై కేంద్ర దర్యాప్తు సంస్థలు ఉక్కుపాదం మోపుతున్న వేళ తమిళనాడు రాజధాని చెన్నైలో భారీగా హెరాయిన్ పట్టుబడటం సంచలనం సృష్టించింది. అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ ముఠా అక్రమ రవాణా ప్రయత్నాన్ని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు భగ్నం చేశారు. శ్రీలంకకు అక్రమంగా తరలించేందుకు సిద్ధం చేసిన సుమారు 71.24 కిలోల హెరాయిన్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఈ డ్రగ్స్ విలువ సుమారు రూ.710 కోట్లుగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.ఈ ఏడాది లో దేశవ్యాప్తంగా పట్టుబడిన హెరాయిన్ నిల్వల్లో ఇది అత్యధిక పరిమా ణాల్లో ఒకటిగా అధికారులు పేర్కొంటున్నా రు. నిఘా వర్గాల నుంచి అందిన పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు అనుమానిత వాహనాల పై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 69 ప్యాకెట్ల లో అత్యంత రహస్యంగా తరలిస్తున్న హెరాయిన్ బయటపడింది.

శాంతిస్థాపనకు ఏదైనా చేయాల్సిందే..

జిన్‌పింగ్, పుతిన్‌తో ట్రంప్ కామెంట్



షెన్‌జెన్ వేదికగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, చైనా అధినేత షీ జిన్‌పింగ్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌ల సమావేశం ప్రారంభమైంది. గ్లోబల్ పవర్స్‌గా పేరుపడ్డ ఈ దేశాల మధ్య జరుగుతున్న తొలి త్రైపాక్షిక సమావేశం ఇది. తాము కలిసి చర్చలకు కూర్చుకోవడం ఇదే తొలిసారని చైనా అధినేత షీ జిన్‌పింగ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ మీటింగ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉందని అన్నారు. భేదాభిప్రాయలు ఉన్న దేశాలతో నేరుగా చర్చలు జరిపేలా కొత్త విదేశాంగ విధానాన్ని అనుసరిస్తున్నామని ట్రంప్ తెలిపారు. ‘మూడు అతిపెద్ద దేశాల అధినేతలుగా పారదర్శకమైన, గౌరవ ప్రదమైన, నిర్మాణాత్మకమైన చర్చలు జరపాల్సిన బాధ్యత మనపై ఉంది. యావత్ ప్రపంచంపైనా ప్రభావం చూపే అంశాల విషయంలో నిర్మాణాత్మకంగా ఉండాలి. విభేదాలు ఉన్న దేశాలతో నేరుగా చర్చలు జరిపేందుకు గత పాలకులు సంకోచించేవారు. కానీ మన ఆలోచన భిన్నమైనది’ అని అన్నారు. పరస్పర సహకారానికి, చర్చలకు ఉన్న అవకాశాలు కాదనుకున్నాక శాంతి స్థాపన సాధ్యం కాదని కూడా ట్రంప్ అన్నారు. మూడు దేశాల మధ్య సహకారం పెరగాలని చైనా అధినేత జిన్‌పింగ్ కూడా అన్నారు. గ్లోబల్ శక్తుల మధ్య సానుకూల వాతావరణం తప్పనిసరి అని అన్నారు. ప్రపంచమే ఓ గ్రామంగా మారిపోయిందని అన్నారు. అందరి జీవితాలు ఒకదానితో మరొకటి ముడిపడి ఉన్నాయని చెప్పారు. మానవాళి పట్ల శక్తిమంతమైన దేశాలకు ప్రత్యేక బాధ్యత ఉందని కూడా చైనా అధినేత వ్యాఖ్యానించారు. రష్యాతో తమకు ప్రత్యేక బంధం ఉందని అ న్నారు. అమెరికాతో కూడా స్థిరమైన దౌత్య బంధం కోసం కృషి చేస్తున్నామని చెప్పారు. షెన్‌జెన్‌లోని కైలిన్ విల్లాలో ఈ సమావేశం జరుగుతోంది. మీటింగ్‌కు ముందు ట్రంప్, జిన్‌పింగ్, పుతిన్‌లు కలిసి ఫొటో దిగారు.

ఎండిన చెట్టు కూలి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి

హైదరాబాద్: ఎండి పోయిన చెట్టు రూపంలో మృత్యువు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి చెందగా.. బంధువుల అబ్బాయి తీవ్రంగా గాయపడ్డాడు. నాగోలు పోలీసులు తెలిపిన మేరకు.. ఏపీలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోల్‌కు చెందిన వి. సాయికుమార్(29) నాగోలు బండ్లగూడ శ్రీ వెంకటేశ్వర కాలనీలో ఇందు అరణ్యలో నివానం ఉంటూ ఇన్ఫోసిస్‌లో సాఫ్?టవేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. గ్యాస్‌బుక్ చేసేందుకు ఔటర్ రింగ్ రోడ్డు దగ్గర ఉన్న గ్యాస్ గోదాం దగ్గరకు ద్విచక్ర వాహనం పై అతని బంధువుల అబ్బాయి సత్య ఫణీంద్రతో కలిసి వెళ్తున్నాడు. కుంట్లూరు రాజీవ్ గృహకల్ప కాలనీ దగ్గర రోడ్డుపై ఉన్న చెట్టు అకస్మాత్తుగా కూలి సాయికుమార్‌పై పడిపోయింది. దీంతో తీవ్ర గాయలతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఫణీంద్ర స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.



మూడు ప్రాంతాల ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి

బ్లూప్రింట్: సీఎం చంద్రబాబు

అమరావతి,నవంబర్,19 : ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి కోసం ప్రభుత్వం రూపొందించిన విశాఖపట్నం, అమరావతి, తిరుపతి ఆర్థిక ప్రాంతాల (ఎకనామిక్ రీజియన్స్) ప్రణాళికలే రాష్ట్రాభివృద్ధికి అనలైన బ్లూప్రింట్ అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. క్యాంప్ కార్యాలయంలో ఈ మూడు ఆర్థిక ప్రాంతాల అభివృద్ధి బ్లూప్రింట్లపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు గుర్తించిన పెట్టుబడులను క్షేత్రస్థాయిలో వాస్తవరూపంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కేవలం పరిశ్రమల రాక, పెట్టుబడుల ఆకర్షణ మాత్రమే అభివృద్ధి కాదని, వాటి ద్వారా ప్రజల ఆదాయాలు పెరిగి జీవన ప్ర మాణాలు మెరుగుపడటమే అసలైన పురోగతి అని ఆయన పేర్కొన్నారు. తలసరి ఆదాయాన్ని పెంచేలా అధికార యంత్రాంగం పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిధిలో యాంకర్ ప్రాజెక్టుగా చేపడుతున్న ప్రాంతానికి ‘విశాఖ బే-టెక్ సిటీ’గా నామకరణం చేశారు. గతంలో హైదరాబాద్‌లో సైబరాబాద్‌ను నిర్మించిన విధంగానే, విశాఖకు అనుబంధంగా అంతర్జాతీయ ప్రమాణాలతో బే-టెక్ సిటీని అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.



నగర మేయర్‌కు వీఈఆర్ స్టీరింగ్ కమిటీలో ప్రాతినిధ్యం కల్పించాలని సూచించారు. ఈ రీజియన్‌లో 167 ప్రాజెక్టులకు గానూ ఇప్పటికే 64 ప్రాజెక్టులు అమల్లోకి వచ్చినట్లు వెల్లడించారు. విజయనగరం, అనకాపల్లి వైపు వేగంగా విస్తరిస్తున్న దృష్ట్యా ముందస్తుగానే ల్యాండ్ బ్యాంక్ సిద్ధం చేయాలని చెప్పారు. భూ లభ్యత తక్కువగా ఉన్న ఉమ్మడి గోదావరి, కృష్ణా జిల్లాల్లో పారిశ్రామిక అవసరాల కోసం ఏపీఐఐసీ సమన్వయంతో ప్రత్యేక ల్యాండ్ పాలసీ తీసుకురావాలని ఆదేశించారు. ఏడాదిలోగా విశాఖలో కన్వెన్షన్ సెంటర్ పూర్తి చేసి, తదుపరి నీఐఐ భాగస్వామ్య సదస్సును అక్కడే నిర్వహించాలని నిర్దేశించారు.

టాక్స్ తగ్గించాం.. మరి జీతాలు పెంచారా?:

భారత పారిశ్రామికవేత్తలకు ప్రధాని మోదీ సూటి ప్రశ్న!

- ఫిక్కీ సదస్సులో పారిశ్రామిక దిగ్గజాలను ప్రశ్నించిన ప్రధాని మోదీ
- సంస్కరణల ద్వారా ఎన్ని ఉద్యోగాలు సృష్టించారో చూపాలని సూచన
- ఉద్యోగుల వేతనాలను ఎంత పెంచారో పరిశ్రమలు నిరూపించుకోవాలని వెల్లడి


న్యూఢిల్లీ,నవంబర్,19 : కార్పొరేట్ పన్నుల తగ్గింపు, పలు ఆర్థిక సంస్కరణలతో ప్రభుత్వం ఇచ్చిన రాయితీలతో పరిశ్రమలు ఎంతమందికి కొత్తగా ఉపాధి కల్పించాయి? ఉద్యోగుల వేతనాలను ఎంతమేర పెంచాయి? అంటూ భారత పారిశ్రామిక రంగాన్ని ప్రధాని నరేంద్ర మోదీ సూటిగా ప్రశ్నించారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన ఫిక్కీ వార్షిక సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పన్నుల తగ్గింపు, నిబంధనల సరళీకరణ, అంతర్జాతీయ వాణిజ్య ఒప్పందాల వంటి ఎన్నో చర్యలు తీసుకుందని ప్రధాని గుర్తుచేశారు. ఆ ఫలాలను ఉద్యోగాల సృష్టి, మెరుగైన వేతనాల రూపంలో ప్రజలకు అందించాల్సిన బాధ్యత పరిశ్రమలపైనే ఉందని స్పష్టం చేశారు. దేశ సర్వతోముఖాభివృద్ధి కేవలం ప్రభుత్వంతోనే సాధ్యం కాదని, పారిశ్రామికవేత్తలు సైతం ఈ ప్రగతి ప్రయాణంలో సమాన భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్ కుదుర్చుకుంటున్న స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల ప్రయోజనాలను అందిపుచ్చుకోవడానికి సంస్థలే సొంతంగా నిర్దిష్ట వ్యూహాలను రూపొందించుకోవాలని సూచించారు. ప్రతిదానికీ ప్రభుత్వంపైనే ఆధారపడవద్దని హితవు పలికారు. విదేశాలకు ఎగుమతి చేసే ఉత్పత్తులకే అత్యున్నత నాణ్యతను కేటాయిస్తూ ‘ఎక్స్‌పోర్ట్ క్వాలిటీ’ పేరిట ప్రచారం చేయడంపై మోదీ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. విదేశీ వినియోగదారులకు అందించే నాణ్యమైన వస్తువులనే భారతీయ పౌరులు కూడా పొందే హక్కు కలిగి ఉన్నారని స్పష్టం చేశారు. దేశీయ మార్కెట్‌ను తేలిగ్గా తీసుకోవద్దని హితవు పలికారు. దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ తయారీ రంగాన్ని బలోపేతం చేయాలని ప్రధాని కోరారు. ప్రపంచానికే ఫార్మసీ హబ్‌గా పేరుగాంచిన భారత్.. కీలకమైన యాక్టివ్ ఫార్మాస్యూటికల్ ఇంగ్రీడియంట్స్ (ఏపీఐ), ముడి పదార్థాల కోసం ఇతర దేశాలపై బిలియన్ల డాలర్లు వెచ్చించాల్సి రావడంపై ఆందోళన వ్యక్తం చేశారు. సమృద్ధిగా ముడి వనరులు ఉన్నప్పటికీ అల్యూమినియం, స్టీల్ రంగాల్లో ప్రత్యేక ఉత్పత్తులను దిగుమతి చేసుకోవడం తగదన్నారు.



బీఆర్ఎస్ నేతలకు మాటలే ఎక్కువ..

పని తక్కువ: మంత్రి ఉత్తమ్

సూర్యాపేట,నవంబర్,19 : బీఆర్ఎస్ నేతలకు మాటలు ఎక్కువ.. పని తక్కువ అని రాష్ట్ర నీటి పారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రజలకు ఉపయోగపడే పనులు చేయడం చేతకాక పిచ్చిపిచ్చి మాటలతో ప్రజ లను తప్పు దోవ పట్టిస్తున్నారని మండిప డ్డారు. ప్రపంచ వ్యాప్తంగా ఎలినో ప్రభావంతో ఏర్పడిన కరువు పరిస్థితులను కాంగ్రెస్ ప్రభుత్వానికి అంటగడుతూ బీఆర్ఎస్ నేతలు తప్పుడు ప్రచారానికి తెరలేపా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం సూ ర్యాపేట జిల్లా హుజూర్ నగర్‌లో లబ్ధిదారులకు పింఛన్లు, సీఎం రిలీఫ్ ఫండ్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి బీఆ ర్ఎస్‌పై తీవ్ర విమర్శలు చేశారు. తమది మాటల ప్రభుత్వం కాదని.. ప్రజల కోసం పనిచే సే ప్రజా ప్రభుత్వ మని స్పష్టం చేశారు. అధికా రంలోకి వచ్చిన మూడేళ్లలోనే అనేక సంక్షేమ పథకాలను అ మలు చేసి ప్రజలకు అండగా నిలిచామని పేర్కొన్నారు. పదేళ్లు అధికారంలో ఉండి ఒక్క కొత్త రేషన్ కార్డు కూడా ఇవ్వని బీఆర్ఎస్ నేతలు ఇప్పుడు తమ ప్రభుత్వాన్ని విమర్శిం చడం విడ్డూరంగా ఉందని ఉత్తమ్ ఎద్దేవా చేశారు. తమ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికీ తెల్ల రేషన్ కార్డులు అందించడంతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా సన్నబి య్యం పంపిణీ చేస్తోందనిచెప్పారు.బీఆర్ఎస్ హయాం లో నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడి గడ్డ, సుందిళ్ల బ్యారేజీలు అప్పటి ప్రభుత్వ హయాంలోనే దెబ్బతిన్నాయని విమర్శించారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణ వాటా సాధించేందుకు తమ ప్రభు త్వం నిరంతరం పోరాడుతోందన్నారు.



పీసీసీ చీఫ్‌కు నీటి ప్రాజెక్టులపై అవగాహన ‘నిల్’

రేవంత్ సర్కార్ పనితీరుకు ఎమ్మెల్యే కోమటిరెడ్డి వ్యాఖ్యలే నిదర్శనం

కమీషన్లపై ఉన్న ధ్యాస నీటి విషయంలో లేదు రేవంత్ సర్కార్‌పై మండిపడ్డ హరీశ్‌రావు

హైదరాబాద్, నవంబర్19: పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్‌కు నీటి ప్రాజెక్టులపై అవగాహన లేదని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీష్ రావు మండిపడ్డారు. ఆయన అజ్ఞానానికి చింతిస్తున్నానని అన్నారు. పాలమూరు, ఎస్ఎల్బీసీ ప్రాజెక్టులను నిరుపయోగంగా మార్చిందే కాంగ్రెస్ ప్రభుత్వమని ఆరోపించారు. తమ అధికారానికి కాపాడుకోవటానికి ఏపీ సీఎం చంద్రబాబుకు దాసోహం అయ్యారని విమర్శించారు. నాగార్జున సాగర్ ఖాళీ అయితే నల్లగొండ జిల్లాకు సాగు, తాగు నీరు దొరకదని ఆందోళన వ్యక్తం చేశారు. సొంత జిల్లాకు భారీ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్యాయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.
రేవంత్ సర్కార్ పనితీరుకు మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలే నిదర్శనమని ఈ సందర్భంగా హరీష్ రావు గుర్తు చేశారు. కృష్ణా నదిపై ఏపీ ప్రభుత్వం ఇన్‌టేక్ వెల్ నిర్మిస్తుంటే రేవంత్ సర్కార్ మొద్దు నిద్ర పోతుందని హరీష్ రావు తెలిపారు. ఇన్‌టేక్ వెల్‌వలన రోజుకు 2 టీఎంసీలు నీరు ఏపీతీసుకుపోతుందని ఆందోళన వ్యక్తం చేశారు.కమీషన్ల మీద ఉన్న ధ్యాస రేవంత్ సర్కార్ కునీటివిషయంలో లేదనిఅన్నారు. నీళ్ల విషయంలో రేవంత్ సర్కార్ అట్టర్ ప్లాప్ అయిందని అభివర్ణిం చారు. తెలంగాణ నీటి హక్కుల మీద ఈ ప్రభుత్వానికి ధ్యాస లేదని ఈ సందర్భంగా తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.





నార్సింగిలో అగ్నిప్రమాదం..

అపార్ట్‌మెంట్‌లో ఒక్కసారిగా మంటలు

రంగారెడ్డి జిల్లా, నవంబరు 19 : రంగారెడ్డి జిల్లా నార్సింగి పరిధిలోని పసిఫికా హిల్‌క్రెస్ట్ అపార్ట్‌మెంట్‌లో అగ్నిప్రమాదం జరిగింది. అపార్ట్‌మెంట్‌లోని బ్లాక్ వద్ద ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చేం దుకు ప్రయత్నిస్తున్నారు. అసలు అగ్నిప్రమాదానికి కారణాలు ఏమిటి?, ఆస్తి నష్టం ఎంత జరిగింది?, ఎవరైనా గాయపడ్డారా? అనే వివరాలు తెలియాల్సి ఉంది.

నారాయణపేట మార్కెట్ యార్డుకు నేడు సెలవు

- బీట్ బంద్ కావున మార్కెట్ యార్డుకు రైతులు ధాన్యాన్ని తీసుకురావద్దు... -నారాయణపేట మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతి...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట వ్యవసాయం మార్కెట్ యార్డుకు గురువారం పెద్ద మొత్తంలో వరి ధాన్యం విక్రయానికి రావడంతో యార్డు పూర్తిగా వరి ధాన్యం కుప్పలు, బస్తాలతో నిండుక పోయింది. దాంతో ఖరీదారులు, వ్యాపారస్తులు,రైతులు పలు ఇబ్బందులకు గురయ్యారు. ఈ నేపథ్యంలో శుక్రవారం బీట్ బంద్ చేయవలసిందిగా కోరుతూ గంజ్ అసోసియేషన్స్ మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతికి గురువారం ఒక లేఖను అందజేశారు.నారాయణపేట మార్కెట్ యార్డులో ధాన్యాన్ని విక్రయించేందుకు వచ్చే రైతులు తమ ధాన్యాన్ని వేసుకునేందుకు స్థలం లేకపోవడం,అలాగే ఖరీదు చేసిన ధాన్యం బస్తాలను లోడింగ్ చేయడానికి హమలీల కొరత ఉన్నందున వ్యాపారస్తులు పలు ఇబ్బందులకు గురవుతున్నట్లు తెలిపారు. కావున శుక్రవారం బీట్ బంద్ చేసి మార్కెట్ యార్డుకు సెలవు ఇచ్చినట్లయితే ధాన్యం బస్తాలు లోడింగ్ చేసుకునేందుకు వ్యాపారస్తులకు అవకాశం కలుగుతుందని వారు తెలిపారు.అందుకు మార్కెట్ కమిటీ కార్యదర్శి భారతి అంగీకరించారు.శుక్రవారం మార్కెట్ యార్డుకు సెలవు కావున రైతులెవ్వరు తమ ధాన్యాన్ని విక్రయానికి తీసుకురావద్దని మార్కెటింగ్ అధికారులు తెలిపారు. గురువారం నారాయణపేట మార్కెట్ యార్డుకు వచ్చిన వరి ధాన్యం వివరాలు ఇలా ఉన్నాయి.వరి సోనా (ఆర్ఎన్ఆర్)11,851 బస్తాలు వచ్చాయి.ఈ వరి ధాన్యానికి క్వింటాలు ధర 4,033-2800 పలికింది. ముఖ్యంగా ఆర్ఎన్ఆర్ వరి ధాన్యానికి మంచి గిట్టుబాటు ధర లభిస్తుందడంతో రైతులు ఆనంద వ్యక్తం చేస్తున్నారు.

నిరుపేదలకు వరం- ఇందిరమ్మ ఇళ్లు

-బోయిన్ పల్లి తండాలో ఇందిరమ్మ ఇళ్లను ప్రారంభించిన సర్పంచ్... -ముఖ్య అతిథిగా హాజరైన కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి... -ముఖ్య అతిథులను ఘనంగా సత్కరించిన లబ్ధిదారులు...



నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం బోయిన్ పల్లి తండాలో సీతా తుల్జా,చంద్రమ్మ దశరథ్‌లకు మంజూరై నిర్మాణం పూర్తి చేసుకున్న ఇందిరమ్మ ఇళ్లను ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ గురువారం ప్రారంభించారు. అంతకుపురం ఆయా కుటుంబాలు గృహప్రవేశ కార్యక్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు కోట్ల రవీందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచ్ లక్ష్మణ్ నాయక్,కోట్ల రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్లు ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పేదల జీవన ప్రమాణాలు మెరుగువడేలా ఇందిరమ్మ ప్రభుత్వం సంక్షేమం,అభివృద్ధికి సమాన ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. నిరుపేదలకు వరం ఇందిరమ్మ ఇళ్లు అని ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ తెలిపారు.కొన్నేళ్ల తర్వాత పల్లె ప్రజలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కావడం శుభ పరిణామామని ఆయన తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లు పొందిన లబ్ధిదారులకు గ్రామ సర్పంచ్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇల్లు పొందిన కుటుంబాలను శాలువాలతో సర్పంచ్ ఘనంగా సత్కరించారు. అలాగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను ఇందిరమ్మ పథకం లబ్ధిదారులు శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు గౌడ్,మాల రాములు,చిన్న జట్రం రామచంద్ర గౌడ్,మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ వెంకటప్ప,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు గోవిందు నాయక్ ,లక్ష్మీపూర్ శ్రీనివాస్,కృష్ణ నాయక్,తుల్జా నాయక్, వెంకట్ నాయక్,మాజీ కో- ఆప్షన్ సభ్యులు పిత్యా నాయక్,సీతా,తులిచా, దేవానంద్,ఆటో హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ రక్షణ సేన నారాయణపేట మండల అధ్యక్షులుగా సందుల రాజు

-నియామకపు పత్రాన్ని అందజేసిన జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్...



నారాయణపేట,(డీకే చాటింపు): తెలంగాణ రక్షణ సేన నారాయణపేట మండల అధ్యక్షులుగా సందుల రాజు నియమితులయ్యారు. తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆదేశాల మేరకు నారాయణపేట నియోజకవర్గంలోని నారాయణపేట మండలం బండగొండ గ్రామానికి చెందిన సందుల రాజును తెలంగాణ రక్షణ సేన పార్టీ నారాయణపేట మండల అధ్యక్షులుగా నియమించారు.ఇందుకు సంబంధించిన నియామకపు పత్రాన్ని గురువారం నారాయణపేటలో ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్,సందుల రాజుకు అందజేశారు.పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత నాయకత్వంలో పార్టీ సిద్ధాంతాలు,ఆశయాలు, ప్రజా సంక్షేమ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేస్తూ, నారాయణపేట మండల పరిధిలో పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయాలని సందుల రాజుకు జిల్లా అధ్యక్షులు సూచించారు. నారాయణపేట మండలంలోని నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలంగాణ రక్షణ సేన నారాయణపేట జిల్లా అధ్యక్షులు గవినోళ్ల శ్రీనివాస్ తెలిపారు.నూతన అధ్యక్షుని ఈ సందర్భంగా పలువురు అభినందించారు.

బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన

-బోయిన్ పల్లి తండాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్యాంకు అవగాహన కార్యక్రమం... -ప్రతి ఖాతాదారుడు బ్యాంకు ఇన్సూరెన్స్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి -నారాయణపేట యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప...





నారాయణపేట,(డీకే చాటింపు): నారాయణపేట మండలం బోయిన్ పల్లి తండాలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప గురువారం బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్ పథకాలపై ప్రజలకు ప్రత్యేకంగా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నారాయణపేట బ్రాంచి మేనేజర్ బి.నర్సప్ప మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు తప్పనిసరిగా బ్యాంకు అందించే ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.ప్రతి కుటుంబానికి ప్రమాద బీమా ఎంతో అవసరమని తెలిపారు. అనుకోని ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు బాధిత కుటుంబానికి ఆర్థిక భరోసాగా బ్యాంకు ఇన్సూరెన్స్ పథకం నిలుస్తుందని వివరించారు. అదేవిధంగా పంట రుణాలకు సంబంధించిన రెన్యువల్ ప్రక్రియను ప్రతి ఏడాది గడువులోగా పూర్తి చేసుకోవాలని ప్రజలకు సూచించారు.ఆ గ్రామ సర్పంచ్ లక్ష్మణ్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఖాతాదారుడు ఇన్సూరెన్స్ చేయించుకోవాలని,ప్రతి కుటుంబానికి బీమా రక్షణ ఉండటం ఎంతో ముఖ్యమని ప్రజలకు వివరించారు.ప్రతి కుటుంబానికి బీమా భరోసా- ప్రతి ఒక్కరికీ ఆర్థిక భద్రత మన లక్ష్యం అన్నారు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు బ్యాంకింగ్ సేవలు, ఇన్సూరెన్స్ పథకాలపై అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పంచాయతీ కార్యదర్శి ఆంజనేయులు గౌడ్,పిత్యా నాయక్,గోవింద్ నాయక్, నరేష్,కృష్ణ నాయక్,తుల్చు నాయక్,మంగ,బుజ్జమ్మ, రుక్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమాను

విజయవంతంగా నిర్వహించాలి

ప్రస్తుతానికి ఆహార భద్రత కార్డు ఉన్న వారికే అవకాశం:కలెక్టర్ ఇలా త్రిపాఠి



నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 19 (డీకే చాటింపు): ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం జిల్లాలో సాఫీగా అమల య్యేలా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. ఈ పథకం అమలు కోసం చేపట్టాల్సిన ఏర్పాట్ల విషయమై సంబంధిత శాఖల అధికారులతో కలెక్టర్ గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సమావేశం నిర్వహించి కీలక సూచనలు చేశారు. జిల్లాలోని అన్ని మున్సిపల్ కార్యాలయాలు, మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీలలో జీవిత బీమా వివరాల నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, ఈ నెల 20వ తేదీ నుండి వివరాల నమోదు చేపట్టాలని ఆదేశిం చారు. ఈ ప్రక్రియ మొత్తం ఆన్ లైన్లో చేయాల్సి ఉన్నందున ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవా లని అన్నారు. కుటుంబ సభ్యుల వివరాలు, నామినీలు, వయసు, బంధుత్వ వివరాలు సరిగ్గా నమోదు చేయాలని తెలిపారు. ప్రత్యేక శిబిరాలలో హెల్ప్ డెస్క్, కంప్యూటర్, ఆన్ లైన్ సదుపాయం తదితర వసతులు ఉండేలా చూసుకోవా లని కలెక్టర్ సూచిం చారు. వివరాలు నమోదు చేసే ఆపరే టర్లు క్షుణ్ణంగా అవగాహన కలిగి ఉండాలని, ఎంపీడీఓ లు నిశిత పర్యవేక్షణ జరపాలని అన్నారు. ఆహార భద్రత కార్డు నెంబర్ ఆధారంగా ఆన్ లైన్లో వివరాలు నమోదు చేసిన మీదట బీమా చేసుకున్న వ్యక్తి మొబైల్ ఫోన్ కు సమాచారం వస్తుందని అన్నారు. నామినీల వివరాలు తెలుపాల్సి ఉన్నందున బీమా చేసుకునే వ్యక్తి నమోదు శిబిరానికి తప్పనిసరి భౌతికంగా హాజరై వివరాలు అందించాల్సి ఉంటుందని కలెక్టర్ స్పష్టం చేశారు. అయితే నామినీలు రావాల్సిన అవసరం లేదని అన్నారు. ఆహార భద్రత కార్డు కలిగి ఉన్న కుటుంబాల వారు ఎక్కడి నుండి అయినా సరే ఈ పథకం కింద తమకు అనుకూలమైన శిబిరానికి వెళ్లి వివరాల నమోదు చేసుకోవచ్చని కలెక్టర్ సూచించారు. కాగా, రిజిస్ట్రేషన్ వివరాలను ప్రత్యేకంగా రిజిస్టర్ లో పొందుప రుస్తూ, రోజువారీగా నివేదిక రూపంలో జిల్లా యంత్రాంగానికి వివరాలు పంపాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మ కంగా అమలు చేయనున్న ఈ పథకాన్ని అధికారు లంతా సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ భుజంగరావు, జెడ్పీ సీఈఓ సాయా గౌడ్, డీఆర్డీఓసాయన్న, నగర పాలక సంస్థ సహాయ కమిషనర్ చంద్రశేఖర్, మున్సిపల్ కమిషనర్లు, మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓ లు, ఎంపీఓ లు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

నేడే మంత్రి సీతక్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్

నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 19 (డీకే చాటింపు): రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా ఇంచార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క శుక్రవారం నిజామా బాద్ జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మంత్రి పర్యటన ఏర్పాట్లను కలెక్టర్ ఇలా త్రిపాఠి గురువారం పరిశీలిం చారు. జిల్లా కేంద్రం లోని రాజీవ్ గాంధీ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన చేయూత పెన్షన్ల పంపిణీ, లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల అందజేత కార్యక్ర మాలలో ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఇంచార్జి మంత్రి పాల్గొననుండగా, కలెక్టర్ ఆడిటోరి యంను సందర్శిం చారు. ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికా రులకు సూచనలు చేశారు.
ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా పక్కాగా ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారు లను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీఆర్ఓ గీత, డీఆర్డీఏ సాయన్న, ఆర్డీఓ రాజేంద్ర కుమార్, నగర పాలక సంస్థ అదనపు కమిషనర్ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

భాగ్యనగరంలో తగ్గిన రియల్ జోరు... నిలబెడుతున్న ఐటీ, జీసీసీలు



హైదరాబాద్: కొన్నేళ్లుగా అనూహ్యమైన వృద్ధిని నమోదు చేసిన హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం ఇప్పుడు కాస్త నెమ్మదించింది. నివాస గృహాల విక్రయాలు మందగించినప్పటికీ, రికార్డు స్థాయిలో ఆఫీస్ స్పేస్ లీజింగ్, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) విస్తరణతో ఉద్యోగాల ఆధారిత డిమాండ్ బలంగా ఉంది. దీంతో రియల్టీ రంగం కుప్పకూలిపోయే ప్రమాదం ఏమీ లేదని, కాస్త జాగ్రత్తపడే దశలోకి ప్రవేశించిందని నిపుణులు విశ్లేషిస్తున్నారు.నైట్ ఫ్రాంక్ ఇండియా నివేదిక ప్రకారం, 2026 ప్రథమార్ధంలో హైదరాబాద్‌లో 19,249 నివాస గృహాల అమ్మకాలు జరిగాయి. ఇది గతేడాదితో పోలిస్తే కేవలం ఒక శాతం మాత్రమే అధికం. ఈనివేదిక ప్రకారం, ఈ ఏడాది ప్రథమార్ధంలో అమ్మకాలు 13 శాతం తగ్గి 26,068 యూనిట్లుగా నమోదయ్యాయి.నివాస గృహాల మార్కెట్ మిశ్రమంగా ఉన్నప్పటికీ, వాణిజ్య సముదాయాల మార్కెట్ మాత్రం దూసుకుపోతోం ది. 2026 ప్రథమార్ధంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు 29 శాతం పెరిగి రికార్డు స్థాయిలో 7.5 మిలియన్ చదరపు అడుగులకు చేరాయి. ఇందులో జీసీసీల వాటానే 45 శాతం (3.4 మిలియన్ చదరపు అడుగులు) ఉండటం గమనార్హం. ప్రస్తుతం నగరంలో 515కు పైగా జీసీసీలు ఉండగా, వీటిలో 3 లక్షల మందికి పైగా నిపుణులు పనిచేస్తున్నారు.


డ్రగ్స్ కు నో చెప్పాలి జీవితంలో ముందుకు సాగాలి....



జనగామ నవంబర్ 19 డీకే చాటింపు జిల్లా ప్రతినిధి :రేపటి భారత దేశ భవిష్యత్తు అయిన నేటి యువత మాదకద్రవ్యాలైన డ్రగ్స్ కు నో చెప్పి మత్తు జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలని జీవితంలో ముందుకు సాగాలని జనగామ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ జా అన్నారు.రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం నషా ముక్తి భారత్ కు సంబంధించిన గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువతను మత్తు పానీయాలకు దూరంగా ఉంచాలని ప్రభుత్వం సంకల్పించిన ఈ యజ్ఞంలో రెడ్ క్రాస్ సంస్థ చేపట్టిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన అభినందించారు. రెడ్ క్రాస్ సొసైటీ జనగామ జిల్లా చైర్మన్ డా. డి. లవకుమార్ రెడ్డి మాట్లాడుతూ జనవరి 12 వరకు యువకులలో అవగాహన కల్పించే ఈ కార్యక్రమం ఉద్యమ రీతిలో కొనసాగుతుందని తెలిపారు. త్వరలో జిల్లా లో నిర్వహించ నున్న కార్యక్రమం రూపొందించి విస్తృత ప్రచారం చేయనున్న ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొని యువకులకు మార్గ నిర్దేశం చేయాలని కోరారు. ఈ రోజు కార్యక్రమంలో రెడ్ క్రాస్ జనగామ జిల్లా కోశాధికారి జి. క్యాథరిన్, స్టేట్ ఎం సి మెంబర్ దొంతుల శేఖర్, జనగాం జిల్లా మేనేజింగ్ కమిటీ సభ్యులు సిహెచ్ సురేందర్ రెడ్డి, డా. బి .హేమంత్ రాజు, శివరాజ్ యాదవ్, ప్రణామ్ వయోవృద్ధుల డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ కన్న పరశురాములు,సి హెచ్.ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

59 ఏళ్ల తర్వాత రైతుకు బీమా రాదు..ఇదే పెద్ద లోటు..!!

-చేనేత నేతన్నలాగా రైతుకు 59 ఏళ్లు దాటిన తర్వాత భరోసా కల్పించాలి... -అప్పుడే ఇందిరమ్మ ఆశయం నెరవేరుతుంది... -ఈ పథకంపై తెలంగాణ ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పరిశీలించాలి... -నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణుగోపాల్...




నారాయణపేట,(డీకే చాటింపు): నేతన్నకు 59 ఏళ్ల వరకు ఎల్ఐసి ద్వారా రూ.5 లక్షల బీమా,59 ఏళ్లు దాటితే టెస్కో ద్వారా భరోసా కొనసాగుతుందని,అదే విధంగా రైతుకు కూడా ఈ విధంగా బీమా సౌకర్యం లభించాలని నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బండి వేణుగోపాల్ గురువారం ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రైతు 59 ఏళ్లు దాటిన తర్వాత కూడా పొలంలోనే ఉంటారు.వయసు మీద పడ్డాకనే ఆయనకు భరోసా ఇంకా ఎక్కువ అవసరం అవుతుందని ఈ సందర్భంగా ఆయన గుర్తు చేశారు.కాబట్టి చేనేత నేతన్నలాగా రైతుకు కూడా 59 ఏళ్లు దాటిన తర్వాత ప్రభుత్వం ద్వారా భరోసా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. రైతును 59 ఏళ్లకే వదిలేయడం కాదు..చివరి వరకు కాపాడుకోవాలి..ఇదే ఇందిరమ్మ ఆశయమని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ పథకం క్షేత్ర స్థాయిలో అమలు చేసేటప్పుడు ప్రజలకు ఎటువంటి సందేహాలు రాకుండా,కుటుంబంలో వృత్తి చేసే ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరే విధంగా స్పష్టమైన మార్గదర్శకాలను విడుదల చేయాలని కోరారు.ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి భద్రత,భరోసా కల్పించాలని అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని నారాయణపేట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత బండి వేణుగోపాల్ అభిప్రాయపడ్డారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకంపై క్షేత్రస్థాయిలో పరిశీలించాలని ఆయన కోరారు.

డీకే చాటింపు
తెలంగాణ దిన పత్రిక
శుక్రవారం,నవంబర్,20, 2026

ఏకధ్రువ ప్రపంచానికి చెక్ పెట్టినట్లేనా..?

ప్రతిమనిషి పుట్టుకతోనే జీవించే హక్కుతో భూమిమీదకు వస్తాడు. మరణం అనేది ఆ హక్కుకు దూరం కావడమే! సాధారణ మరణం సహజ ప్రక్రియ. యుద్ధ మరణం అనేది ఉన్మాద చర్యతో జీవించే హక్కును అర్థాంతరంగా తుంచివేయడం. అందుకే ఏరకమైన యుద్ధమైనా వినాశ హేతువే? యుద్ధం ఒక పీడకచర్య. యుద్ధ మరణాలకు హేతుబద్ధత ఉండదు. మధ్యయుగాలలో యుద్ధమంటే వీరత్వానికి ప్రతీక. అటు తర్వాత ఆయుధం ప్రధానపాత్ర వహించింది. అధికారానికి ఆయుధం ప్రాకారంగా నిలిచింది. సాంకేతికత అభివృద్ధి చెందిన ఈ దశలో ఆయుధానిదే పైచేయి అయింది. ఇప్పుడు యుద్ధ వ్యూహాల్లో మార్పులొచ్చాయి. ఒకప్పుడు రష్యా, అమెరికా ప్రచ్ఛన్న యుద్ధస్థితి నుంచి, రష్యా అంతర్గత రాజకీయ మార్పుల తర్వాత అమెరికా ఏకధ్రువ ప్రపంచంగా ఎదిగింది. అంతేకాదు, తమ భూభాగంలో కాకుండా ప్రపంచం మొత్తం యుద్ధ స్థావరాలు ఏర్పరచుకొని, సైన్యాన్ని మోహరించి ప్రపంచ పోలీసుగా పెత్తనం చేస్తోంది. జనరల్ గడాఫీ, అలెండీ, సద్దాం హుస్సేన్ లాంటి ఎందరో దేశాధినేతలను హత్య చేయడంతో పాటు, ఆసియా, అమెరికా, ఆఫ్రికా ఖండాల్లో అనేక దేశాలతో యుద్ధాలు చేసింది. చివరకు తమ వ్యాపార సామ్రాజ్యానికి పోటీరాకుండా జపాన్‌లోని హిరోషిమా, నాగసాకి నగరాలపై అణుబాంబులు వేసి సామూహిక మానవహననానికి అమెరికా పాల్పడింది. వియత్నాంతో పదహారేళ్ల సుదీర్ఘ యుద్ధం తర్వాత అమెరికా దూకుడుకు కళ్లెం పడింది. ఇప్పుడు ఇరాన్‌తో భూతల యుద్ధంతో తలపడడం అంటే చావునోట్లో తలపెట్టడమేనన్న వ్యవహారం అర్థమైన తర్వాత ఇంటా, బయట ఏకాకిగా మారిన ట్రంప్, వ్యూహం మార్చి ఇరాన్‌తో సీజ్ పైర్‌కు తాపత్రయ పడ్డాడు. వ్యూహాత్మకంగా ఊపిరి పీల్చుకోవడానికి ఇరాన్ కూడా పది షరతులతో సిద్ధమైంది. సీజ్‌పైర్ అనబడే ఒప్పందం అనేది ఇటీవల కాలంలో ముందుకొచ్చిన దౌత్య ప్రక్రియనే. ఒకప్పుడు గ్రూపుల మధ్య ఒప్పందం ఇప్పుడు దేశాల మధ్యకు మారింది. భారత్–పాకిస్తాన్, ఇరాన్–ఇజ్రాయిల్ యుద్ధాలలో ట్రంప్ ముందుకు తెచ్చిన ప్రక్రియనే ఇది. కొత్తదేం కాదు, కాకుంటే ఓటమి అంచుల్లో పరువు దక్కించుకునే ఏకైక సూచిక! ట్రంప్ రెండువారాల యుద్ధ వెసులుబాటుకు ప్రయత్నమే ఆయనలో నెలకొన్న ఓటమి భయానికి నిదర్శనం. ఇరాన్‌లో 240మంది మహిళలు, 212 మంది పిల్లలు వెరసి 2076 మంది ప్రజలు యుద్ధంలో మరణించారు, 26,500 ప్రజలు గాయపడ్డారు. మిత్రదేశం లెబనాన్‌లో మరో 13వందల మంది ప్రజలను ఇజ్రాయిల్ చంపేసింది. అంతేకాదు, యుద్ధ ప్రారంభంలోనే ఇజ్రాయిల్, అమెరికా కుట్రపూరితంగా ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా ఖొమైనీని అంతం చేసింది. అయినా ఇరాన్ తమ మౌలిక వనరుల రక్షణ దృష్టితో సీజ్‌ఫైర్‌కు అంగీకరించింది. సుదీర్ఘ కాలం తమవెంట ఉన్న పశ్చిమ యూరప్ దేశాల యుద్ధ కూటమి 'నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్' నాటోలోని 30 దేశాలు ఇరాన్‌పై ట్రంప్ దాడికి మద్దతివ్వలేదు. సరికదా కొన్ని దేశాలు నేరుగా ఇరాన్‌కు మద్దతు తెలిపాయి. ఇక ప్రపంచ దేశాల ప్రజలతో పాటు, తనదేశంలో ప్రజలు నిరసన పతాకస్థాయికి చేరడంతో ట్రంప్ ఓ అడుగు సీజ్‌పైర్ పేరుతో వెనక్కి తగ్గాడు తప్ప, తనలోని యుద్ధ పిపాసి ఇంకా చావలేదు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన తర్వాత పిచ్చోడి చేతిలో రాయిలా ప్రపంచ దేశాలపై టారిఫ్‌ల పేరుతో విరుచుకుపడ్డాడు. గాజా విషయంలో ఇజ్రాయిల్ అమానుష కాండకు పరోక్షంగా మద్దతిచ్చాడు. పనామా అధ్యక్షుడు నోరిగోను మాదకద్రవ్యాల పేరుతో జైలు శిక్ష వేసి నిర్భందించాడు."ఆపరేషన్ అబ్జార్వేట్ రిజర్వ్" పేరుతో ప్రజలచేత ఎన్నికైన వెనెజులా అధ్యక్షుడు మదురో, ఆయన భార్య సిలియాలను అర్ధరాత్రి ఇంటినుంచి కిడ్నాప్ చేసి అమెరికా జైలులో నిర్భంధించాడు.కేవలం ఆయిల్‌పై నియంత్రణ కోసం ఒకదేశ సార్వభౌమత్వాన్ని ప్రశ్నార్థకం చేయడమే కాక, తన పదవీ కాలం ముగిసిన తర్వాత వెనెజులాలో ఎన్నికలని కుళ్లు జోకులు వేస్తున్నాడు. పక్క రాష్ట్రం మెక్సికోతో ఘర్షణ, చిన్నదీవి లాంటి దేశం క్యూబాపై మానవత్వం మరచి ఆంక్షలు పెట్టడంతో పాటు, ఇరాన్ యుద్ధం తర్వాత క్యూబా అంతు చూస్తానంటున్నాడు. మరోవైపు పక్క దేశం కెనడాను తమదేశంలో అంతర్భాగం రాష్ట్రంగా కలుపుకుంటామని అవాకులు చవాకులు పలుకుతున్నాడు. నాటోలో అంతర్భాగమైన డెన్మార్క్‌కు చెందిన గ్రీన్‌లాండ్‌ను స్వాధీనం చేసుకుంటామని ప్రకటించి నాటో కూటమి దేశాల్లో తమ పరపతి కోల్పోయాడు. ఆఫ్ఘనిస్తాన్‌లోని కాందహార్ విమానాశ్రయం కావాలని పట్టుబడుతున్నాడు. మరో ముఖ్యమైన విషయం. ఎప్‌స్టీన్ పైల్స్ నుండి బయటపడడం కోసం, అత్యంత పెద్దదైన ఆసియా ఖండంలో పట్టుకోసం మరో యుద్ధోన్మాద దేశం ఇజ్రాయిల్‌తో కలిసి కుట్రపన్నాడు! ఇరాన్‌ను ఓడిస్తే తనకు ప్రపంచంలో తిరుగుండదని, యుద్ధ ప్రారంభంలోనే ఖొమైనీ లాంటి ఆయువుపట్టును లేపేస్తే, తాను వెనెజులా దేశంలా ఇరాన్‌ను కబళించి ఆధిపత్యం చెలాయించాలని చేసిన ప్రయోగం బెడిసికొట్టింది.



టీ-ప్రైడ్ సబ్సిడీ బకాయిల కోసం లంబాడీల ధర్నా
1,700 కోట్ల బకాయిల విడుదలకు డిమాండ్





(డీకే చాటింపు,హైదరాబాద్): టీ-ప్రైడ్ పథకం కింద ఎస్టీ లంబాడీ లబ్ధిదారులు కొనుగోలు చేసిన కార్లు, జేసీబీలు, హిటాచీ వాహనాలు, వరికోత మిషన్లపై పెండింగ్‌లో ఉన్న రూ. 1,700 కోట్ల సబ్సిడీ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ లంబాడీలు కదం తొక్కారు. గిరిజన విద్యార్థి సంఘం, నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి(జాతీయ, రాష్ట్ర కమిటీలు) ఆధ్వర్యంలో వందలాది మంది లబ్ధిదారులు ఆబిడ్స్‌లోని పరిశ్రమల శాఖ కమిషనరేట్ కార్యాలయాన్ని ముట్టడించారు.పెద్ద ఎత్తున కార్యాలయానికి చేరుకున్న ఆందోళనకారులు ప్రభుత్వానికి, సీఎం రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేసారు.ఈ సందర్భంగా నంగారా భేరి లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు ఏ. రాజ్ కుమార్, జాతీయ అధ్యక్షుడు వెంకట్ బంజారా, ధరావత్ గణేష్ నాయక్ మాట్లాడుతూ బ్యాంకు రుణాల వాయిదాలు,వడ్డీ భారం పెరిగి లబ్ధిదారులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 24 గంటల్లోగా 1,700 కోట్ల సబ్సిడీ నిధులను సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేయాలని డిమాండ్ చేశారు.?ఈ నిరసన కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రవీందర్, బి. రాందాస్ నాయక్, ఎం. సుధాకర్, బి. రవి నాయక్, ఎం. నీలేష్ నాయక్, ఎన్. హనుమంతు, ప్రవీణ్ కుమార్, జి. రాజేష్, రవికాంత్, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు కేతావత్ మునిబాయి, జాతీయ అధ్యక్షురాలు అజ్మీర సుశీల, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. దేవి బాయి, ఉపాధ్యక్షురాలు అచ్చి బాయి, తన్ను బాయి, వర్మ బాయి తదితరులతో పాటు వందలాది మంది లంబాడీలు పాల్గొన్నారు.

కస్తూర్బాబాలికలవిద్యాలయంను
ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్





నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 19 (డీకే చాటింపు): మాక్లూర్ మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యా లయాన్ని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆకస్మికంగా తనిఖీచేశారు.పాఠశాలలోని తరగతి గదులను పరిశీలించారు. వంట గది, స్టోర్ రూంలో సరుకుల నాణ్యత తనిఖీ చేశారు. విద్యార్థి నుల కోసం సిద్ధం చేసి న ఆహారాన్ని పరిశీ లించి, మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నా రు. ప్రభుత్వం నిర్దేశించి న మెనూ ప్రకారం నాణ్యమైన పౌష్టిక ఆహారాన్ని అందించా లని నిర్వాహ కులను ఆదేశించారు. సరుకుల సరఫరా విషయంలో ఏమైనా ఇబ్బం దులు ఉంటే అధికారుల దృష్టికి తేవాలని, స్టాక్ రిజిస్టర్ పక్కాగా నిర్వ హించాలని సూచించా రు. కాగా,గత కొన్ని రోజులుగా నిత్యావస రాలలో కొన్ని రకాల సరుకులను కాంట్రాక్టర్ పంపకపోవడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొం టున్నామని స్పెషల్ ఆఫీసర్ కలెక్టర్ దృష్టికి తేగా,ఎప్పటికప్పుడు నిత్యావసరాల కోసం విద్యా శాఖ ద్వారా ప్రత్యేకంగా నిధులను అందజేయించారు. నిత్యావసరాలు సమ కూర్చే కాంట్రాక్ట్ ఏజెన్సీ ని సంప్రదించి సరుకు లు సక్రమంగా సరఫరా చేసేలాచర్యలు తీసుకో వాలని, లేని పక్షంలో ఏజెన్సీకి షోకాజ్ నోటీ సులు ఇచ్చిబ్లాక్ లిస్టు లో పెడతామని కలెక్టర్ హెచ్చరించారు.కాగా, బాలికల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను లోనికి అనుమతించ కూడదని ఆదేశించారు. ఇంటర్మీడియట్ విద్యా ర్థినులకు నీట్ కోచింగ్ అందిస్తుండడం పట్ల కలెక్టర్ అభినందిస్తూ, అత్యధిక మందికి ప్రవేశాలు లభించేలా చూడాలని నిర్వాహ కులకు సూచించారు. ఈసందర్భంగా కేజీబీవీ విద్యార్థినులతో కలెక్టర్ ఇలా త్రిపాఠి భేటీ అయ్యారు. వారికి పలు ప్రశ్నలు వేస్తూ అభ్యాస న సామర్థ్యాన్ని అంచ నా వేశారు. తన వెంట తెచ్చినదైరీలు,చాక్లెట్లు, బహుమతులను అందించారు. చక్కగా చదువుకోవాలని, అదే సమయంలో వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండ కుండా అనుక్షణం అప్ర మత్తంగా వ్యవహరిం చాలని జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించా రు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగరావు, ఇంచార్జి డీఈఓ సాయాగౌడ్, ఎంఈఓ సత్యనారా యణ, కేజీబీవీ స్పెషల్ ఆఫీసర్ స్రవంతి తదితరులు ఉన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం
19నుండి ప్రత్యేక శిబిరాల్లో వివరాల నమోదు-అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు పథకం వర్తించేలా చర్యలు: కలెక్టర్ ఇలా త్రిపాఠి





నిజామాబాద్ ప్రతినిధి, నవంబర్ 18 (డీకే చాటింపు): ప్రభుత్వం ప్రతి ష్టాత్మ కంగా అమలు చేయను న్న ఇందిరమ్మ కుటుం బ జీవిత బీమా పథకం నమోదు ప్రక్రియ ఈ నెల 19వ తేదీ నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి మాక్లూర్ మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాల యంలో ఏర్పాటు చేసిననమోదు కేంద్రా న్ని పరిశీలించారు.ఈ సందర్భంగా నమోదు కేంద్రంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, కంప్యూటర్, ఆన్‌లైన్ సదుపా యాలు, అందు బాటులో ఉన్న సిబ్బం ది తదితర ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు. బీమా పథకం నమోదు ప్రక్రియకు సంబంధించి ఆపరేటర్‌ను పలు ప్రశ్నలు అడిగి, వివరా ల నమోదు విధానం, అవసరమైన పత్రాలు, ఆన్‌లైన్‌లో నమోదు చేసే విధానం తదితర అంశాలపై సన్నద్ధతను తెలుసుకున్నారు.నమోదు ప్రక్రియలో ఎలాంటి లోటుపాట్లకు తావులే కుండా పకడ్బందీగా నిర్వహించాలని, సంబంధిత అధికారులు, సిబ్బంది సమన్వ యంతో పనిచేయాలని కలెక్టర్ సూచించా రు. లబ్ధిదారుల వివరాల నమోదులో ఎలాంటి తప్పిదాలు జరగకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలని, నమోదు చేసిన వివ రాలను సరిచూసు కున్న తర్వాతే ఆన్లైన్ ప్రక్రియను పూర్తి చేయా లని ఆదేశిం చారు. స్థానిక మీడియా ప్రతినిధుల తో కలెక్టర్ మాట్లాడు తూ, ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి నిజామా బాద్ నగర పాలక సంస్థతో పాటు బోధన్, ఆర్మూర్, భీమ్‌గల్ మున్సిపల్ కార్యాలయాలు, జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లోని గ్రామ పంచాయతీలలో ప్రత్యేక నమోదు శిబిరాలు అందుబాటులో ఉంటా యని వెల్లడిం చారు. వీటిని క్రమంగా అన్ని గ్రామ పంచాయ తీలు, వార్డులకు విస్తరింపజేస్తామని తెలిపారు. ప్రజలు ఎలాంటి ఆందోళనకు గురికావాల్సిన అవసరంలేదని, జిల్లా లో అర్హత కలిగిన అన్ని కుటుంబాలకు ఈ పథకం వర్తించేలా అవసరమైన చర్యలు తీసుకుంటా మని కలెక్ట ర్ స్పష్టంచేశారు.ఆహార భద్రత కార్డు కలిగి ఉన్న వారు జిల్లాలో ఎక్కడి నుంచైనా తమ వివరాలను నమోదు చేసుకునే వెసులు బాటు ఉందని కలెక్టర్ తెలిపారు. అయితే బీమా చేయించుకునే వ్యక్తి మాత్రం నమోదు శిబిరానికి భౌతికంగా హాజరై సంతకం చేయాల్సి ఉంటుందని స్పష్టంచేశారు.నామినీలు నమోదు కేంద్రానికి వ్యక్తిగతంగా హాజరు కావాల్సిన అవసరం లేదని, ఒకరి కంటే ఎక్కువ మంది నామినీలను ఎంపిక చేసుకునే వెసులు బాటు కూడా ప్రభుత్వం కల్పించిం దని తెలి పారు. నామినీల పేర్లు కూడా సంబంధిత ఆహార భద్రత కార్డులో నమోదై ఉండాలని సూచించారు.ఆహార భద్రత కార్డు లేని వారు తమ ఆధార్ కార్డును వెంట తీసుకుని నమోదు శిబిరానికి రావాలని కలెక్టర్ సూచించారు.

ప్రతి నాలుగు శిబిరాలకు ఒక సూపర్వైజర్

ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగ కుండా నమోదు ప్రక్రియ సజావుగా కొనసాగేందుకు ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేశామని కలెక్టర్ తెలిపారు. ప్రతి నాలుగు నమోదు శిబిరాలకు ఒక సూప ర్వైజర్‌ను నియమిం చామని, ఇతర సంబంధిత అధికా రులు కూడా నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సమ న్వయంతో పనిచేస్తా రని వెల్లడించారు. నమోదు ప్రక్రియలో ప్రజలకు అవసరమైన సహాయాన్ని అందించ డంతో పాటు, వివరాల నమోదులో తప్పిదాలు జరగకుండా అధికా రులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి పథకం ప్రయోజనం అందేలా సమర్థవంతం గా పనిచేయాలని సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ భుజంగ రావు, జెడ్పీ సీఈఓ సాయాగౌడ్, మండల స్పెషల్ ఆఫీసర్ కృష్ణవేణి, ఇంచార్జి డీపీఓ నాగరాజు, సర్పంచ్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహ సీల్దార్ శేఖర్, పీఏ సీఎస్ చైర్మన్ అశోక్ తదితరులు ఉన్నారు.

వన్ టౌన్ పోలీస్ స్టేషన్ తనిఖీ చేసిన డిఐజి



నిజామాబాద్ ప్రతినిధి నవంబర్ 19 (డీకే చాటింపు): బాసర జోన్ 2 డిఐజి నారాయణ నాయక్ నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ చేశారు. డి ఐ జి నారాయణ నాయక్ కు పూల మొక్కను నిజామాబాద్ కమిషనర్ సాయి చైతన్య అందించి స్వాగతం పలికారు. పోలీస్ స్టేషన్ లోని కేసుల వివరాలు అన్ని విభాగాలు క్షుణ్ణంగా తనిఖీ చేసి పోలీసు వ్యవస్థ పట్ల ప్రజలకు భరోసా కల్పించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని డిఐజి సూచించారు. పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదు దారుల తో గౌరవంగా మెలగాలని న్యాయం జరుగుతుంద ని భరోసా కల్పించాలని కోరారు. ఆధునిక సాంకేతికను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకుం టూ కేసులు పురోగతిని సాధించాలన్నారు. కోర్టులో పెండింగ్లో ఉన్న కేసులను వెంటనే పరిష్కారానికి దాఖలకు వేగంగా స్పందించాలని సూచిం చా రు. పోలీసులు నూతన చట్టాలు తదితరంశా లపై ఎప్పటికప్పుడు అవగా హన కలిగి ఉండాలన్నారు. డిఐజి వెంట పోలీస్ కమిషనర్ తో పాటు నిజాంబాద్ ఏసిపి ప్రకాష్ ,ట్రాఫిక్ ఏసిపి మస్తాన్ అలీ ,స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ మల్లేష్,సబ్ ఇన్స్పెక్టర్ బాల్ సింగ్ తదితర సిబ్బంది ఉన్నారు.

నూత్పల్లి గ్రామంలో దేవాలయాలను దర్శిశీ చుకున్న వినయ్ కుమార్ రెడ్డి



ఆర్మూర్ విలేఖరి నవంబర్ 19(డీకే చాటింపు): డొంకేశ్వరు మండలం నూత్ పల్లి గ్రామంలో అగ్గి మల్లన్న స్వామి, ముద్దేశ్వర, పెద్దమ్మ తదితర దేవాలయా లను దర్శించుకుని గుడి అభివృద్ధి పై ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి గ్రామస్తు లతో చర్చించారు. ఆలయల అభివృద్ధికి తన వంతు పూర్తి సహకారం ఉంటుందని అంతేకాకుండా నియో జకవర్గంలోని గ్రామాల న్నింటిలో సౌకర్యాలు కల్పించడానికి ముందుంటానని ఈ సందర్భంగా అన్నారు. డొంకేశ్వర మండలం కాంగ్రెస్ అధ్యక్షులు అధ్యక్షులు బాబురావు, డొంకేశ్వరం మాజీ మండల అధ్యక్షులు భూమేష్ రెడ్డి, డొంకేశ్వర మండల సర్పంచ్ల ఫోరం అధ్య క్షుడుసంజీవ్, డొంకేశ్వర్ మండల గ్రామాల సర్పంచులు అల్లరి గంగాధర్, సుమన్, ప్రకాష్, భూమన్న, దశరథ్,మహేష్ , నూత్ పల్లి గ్రామ నాయకులు గంగారెడ్డి, లిఫ్ట్ చైర్మన్ భోజ రెడ్డి, ఉప సర్పంచ్ నరసారెడ్డి సంజీవ్, సాయి రెడ్డి, సుదర్శన్ రెడ్డి భూపాల్ రెడ్డి, వెంకటరామ్ రెడ్డి, తుక్కన, డొంకేశ్వర్ గ్రామం కాంగ్రెస్ నాయకులు భరత్ రెడ్డి, తదితర కాంగ్రెస్ నాయ కులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా వ్యాప్తంగా ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



జనగామ నవంబర్ 19డీకే చాటింపు జిల్లా ప్రతినిధి :జనగామ జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో భారత మాజీ ప్రధానమంత్రి, ఉక్కు మహిళ శ్రీమతి ఇందిరా గాంధీ 109 వ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారు.గురువారం ఈ సందర్భంగా జిల్లా కేంద్రమైన జనగామ తో పాటు స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి నియోజకవర్గ కేంద్రాలతో పాటు మండల కేంద్రాల్లో గ్రామాల్లో కేక్ కట్ చేసి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమాలలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా కు నేతల నివాళులు

(డీకే చాటింపు,హైదరాబాద్): భారత మాజీ ప్రధాని దివంగత ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని ఆమె విగ్రహానికి టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ జగదీశ్వర్ రావు, మాజీ మంత్రులు దానం నాగేందర్, గీతారెడ్డి, కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ.. యావత్ ప్రపంచం ఉక్కు మహిళగా కీర్తించిన ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా ఆమెకు ఘన నివాళులర్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమంది నాయకులకు ఇందిరా గాంధీ తీసుకున్న నిర్ణయాలు నేటికీ మార్గదర్శకంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. దేశాభివృద్ధి, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఇందిరా గాంధీ నిరంతరం కృషి చేశారని అన్నారు. గుడిసెలు లేని గ్రామాలు ఉండాలనే సంకల్పంతో పేదల అభ్యున్నతికి ఆమె విశేష ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. 'గరీబీ హటావో' నినాదం పేదరిక నిర్మూలన పట్ల ఆమెకున్న నిబద్ధతకు నిదర్శనమని పేర్కొన్నారు.దేశం కోసం అనునిత్యం శ్రమించిన మహానాయకురాలు ఇందిరా గాంధీ ఆశయాలను కొనసాగించడమే ఆమెకు మనం అందించే నిజమైన నివాళి అని అన్నారు.



సామాన్యుడిపై రుణభారం.. రెపో రేటు పెంపు.. వడ్డీ మోత..!



రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు పెంచి5.5 శాతానికి చేర్చడంతో రుణగ్రహీతల పై అదనపు భారం పడుతోంది. ఆర్‌బిఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ సహా పలు బ్యాంకులు తమ రెపో ఆధారిత రుణ వడ్డీ రేట్లను సవరించాయి. దీంతో కొత్తగా గృహ, వాహన రుణాలు తీసుకునేవారితో పాటు ఇప్పటికే రెపో ఆధారిత రుణాలు పొందినవారిపైనా ప్రభావం పడుతోంది.

పంజాబ్ నేషనల్ బ్యాంక్ రెపో ఆధారిత రుణ వడ్డీ రేటును 8.10 శాతం నుంచి 8.35 శాతానికి, ఇండియన్ బ్యాంక్ 7.95 శాతం నుంచి 8.20 శాతానికి పెంచాయి. ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్,బ్యాంక్ ఆఫ్ ఇండియా కూడా తమ రేట్లను 8.10 శాతం నుంచి 8.35 శాతానికి సవరించాయి. బ్యాంక్ ఆఫ్ బరోడా రేటును 8.15 శాతానికి పెంచింది.

ఆర్‌బిఐ నిర్ణయంతో బ్యాంక్ ఆఫ్ బరోడా, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూకో బ్యాంక్ సహా పలు బ్యాంకులు తమ రెపో ఆధారిత రుణ వడ్డీ రేట్లను సవరించాయి. ఆర్‌బిఎల్ బ్యాంక్ రెపో లింక్డ్ రుణ వడ్డీ రేటు 8.50 శాతంగా ఉంది. యూకో బ్యాంక్ నుంచి వివిధ బెంచ్‌మార్క్ రేట్లను సవరించింది.రెపో రేటుతో అనుసంధానమైన పాత రుణాలపై వడ్డీ రేట్లను సాధారణంగా 90 రోజుల్లోగా సవరించే అవకాశం ఉంది. అయితే ఈ పెంపు ప్రభావంరుణ ఒప్పందం, వడ్డీ రేటు రీసెట్ నిబంధనలు, మిగిలిన రుణ కాలవ్యవధిపై ఆధారపడి ఉంటుంది. మరోవైపు డిపాజిట్ రేట్ల విషయంలో బ్యాంకులు తక్షణమే పెంపు చేపట్టకపోవచ్చని అంచనాలున్నాయి.

ఔషధ కంపెనీలకు జీఎస్‌టీ ఊరట!



ఔషధ తయారీ సంస్థలకు జీఎస్‌టీ మండలి కీలక ఊరటనిచ్చింది. ఉచితంగా పంపిణీ చేసే మందులు, గడువు తీరడంతో నిబంధనల ప్రకారంధ్వసం చేసే ఔషధాలపై చెల్లించిన పన్నుకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ (ఐటీసీ) పొందేందుకు అనుమతించింది. ఈ మార్పులు వచ్చేఆర్థిక సంవత్సరం నుంచి అమల్లోకి రానున్నాయి. దీంతో ఔషధ కంపెనీల నిర్వహణ వ్యయాలు తగ్గడంతో పాటు, నగదు లభ్యత మెరుగుపడేందుకు అవకాశం కలుగుతుంది. ఔషధ కంపెనీలు వైద్యులకు మందుల నమూనాలను ఉచితంగా అందిస్తుంటాయి. ఇదే విధంగా గడువు తీరిన మందులను విపణి నుంచి వెనక్కి తీసుకుని, నిబంధనల ప్రకారం ధ్వంసం చేయాలి. ఇప్పటివరకు వీటిపై ఐటీసీ ప్రయోజనం లేకపోవడంతో, కంపెనీలకు అదనపు వ్యయం అవుతోంది. కొత్త నిబంధనలతో ఈ భారం తగ్గనుంది. ఎఫ్‌ఎంసీజీ కంపెనీలకూ ఇదే ఊరట కలగనుంది. ఫార్ములేషన్లు, టీకాలు, బయోలాజిక్స్, వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన ఉత్పత్తులు, వినియోగదారుల ఆరోగ్య ఉత్పత్తులను తయారు చేసే సంస్థలకు ఈ నిర్ణయం మేలు చేకూరుస్తుందని ఈవై ఇండియా లైఫ్ సైన్సెస్, హెల్త్‌కేర్ పన్నుల విభాగం అధిపతి ఆశిష్ జైన్ తెలిపారు. ఫార్మా రంగానికి జీఎస్‌టీ మండలి నిర్ణయం రెండు విధాలుగా ప్రయోజనం చేకూర్చనుందని డెలాయిట్ ఇండియా పరోక్ష పన్నుల విభాగం పార్ట్‌నర్ మహేశ్ జైసింగ్ తెలిపారు. చట్ట ప్రకారం ధ్వసం చేయాల్సిన మందులపై ఐటీసీకి అనుమతినివ్వడం, ఇన్‌వర్టెడ్ డ్యూటీ విధానంలో పన్ను వాపసు లెక్కింపు, మూలధన వస్తువులనూ పరిగణనలోకి తీసుకోవడం ఉపకరిస్తుందన్నారు. జీఎస్‌టీ 2.0 తర్వాత ఈ రంగంలోని పలు ఉత్పత్తులపై 5% పన్ను రేటు అమల్లో ఉంది. ఉచితంగా పంచిన, గడువు తీరాక ధ్వంసం చేసిన ఔషధాల తయారీకి చెల్లించిన పన్ను వాపసు పొందే వీలు లేకపోవడం కంపెనీలకు సమస్యగా మారుతోంది. తాజా మార్పులతో ఐటీసీ భారం తగ్గి, అనవసర పన్ను వివాదాలూ తగ్గుతాయని పేర్కొన్నారు. ఫలితంగా తయారీదారులు, ఎగుమతిదారుల నగదు ప్రవాహం మెరుగుపడుతుందని వివరించారు. తయారీ కేంద్రాలు, ఉత్పత్తి యంత్రాలు, ఎగుమతి ఆధారిత కార్యాకలాపాలపై పెట్టుబడులు పెట్టే సంస్థలకు, ఐటీసీ వాపసు ప్రయోజనకరంగా ఉంటుందని ఈవై ఇండియా ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ విభాగం పార్ట్‌నర్ సురేశ్ నాయర్ పేర్కొన్నారు.

వార్షిక మొత్తం విక్రయాల్లో 1 బిలియన్ డాలర్‌ను అధిగమించిన అమెజాన్ నౌ



తన అల్ట్రా-ఫాస్ట్ డెలివరీ సేవ అమెజాన్ నౌ గత మూడు నెలల్లో భారత్‌లో వార్షిక మొత్తం విక్రయాల్లో 1 బిలియన్ డాలర్‌ను అధిగమించిందని అమెజాన్ ఈరోజు ప్రకటించింది. ప్రారంభమైనప్పటి నుండి ప్రతి క్వార్టర్‌లో అమెజాన్ నౌ ఆర్డర్లు రెట్టింపు అయ్యాయి, ఇది అమెజాన్ ఇండియా చరిత్రలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ వ్యాపారంగా మారింది.

పండుగ సీజన్‌కు ముందు కంపెనీ 10 వారాల కంటే తక్కువ సమయంలో అమెజాన్ నౌ ను 4 రెట్లు ఎక్కువ నగరాలకు విస్తరించి, నిమిషాల్లో డెలివరీని భారత్‌లోని 60కి పైగా నగరాలు ఉ పట్టణాలకు తీసుకెళ్లింది. మెట్రో నగరాలు కాకుండా, ఈ సేవ పదుబిద్రి, తిరుపతి, గుంటూరు, గురుదాస్‌పూర్, జలంధర్, వెల్లూరు, ధార్వాడ్, వరంగల్ ఉ బెర్హంపూర్ వంటి పట్టణాల్లోని కస్టమర్లకు కూడా అందుబాటులో ఉంది. ఈఆర్డర్లు 750కి పైగా మైక్రో-ఫుల్‌ఫిల్‌మెంట్ మరియు అర్బన్ ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాల నెట్‌వర్క్ ద్వారా నిమిషాల్లో డెలివర్ చేయబడతాయి. సమీర్ కుమార్, కంట్రీ మేనేజర్, అమెజాన్ ఇండియా,

"చాలా తక్కువ కాలంలో, అమెజాన్ నౌ భారత్‌లో వార్షిక మొత్తం విక్రయాల్లో 1 బిలియన్ డాలర్‌ను అధిగమించింది, ఇది అమెజాన్ ఇండియా చరిత్రలో అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ఇ-కామర్స్ బిజినెస్ యూనిట్‌గా మారింది.

ప్రతి క్వార్టర్‌లో ఆర్డర్లు రెట్టింపు అవుతుండటంతో, కస్టమర్ల ఈ స్పందనకు మేము వినమ్రులమవుతున్నాము. దీపావళి నాటికి 100 నగరాలకు విస్తరించే మార్గంలో మేము ఉన్నాం,నిమిషాల్లో డెలివరీని ఉత్తరాన గురుదాస్‌పూర్ ఉ హోషియార్‌పూర్ నుండి దక్షిణాన వె ంబాయం ఉ అలంకోడ్ వరకు తీసుకువెళుతున్నాం. ఈ పండుగ సీజన్‌లో దేశవ్యాప్తంగా కస్టమర్లు అత్యంత వేగంతో అతి విస్తృత ఎంపిక డెలివరీని ఆశించవచ్చు."

దేశవ్యాప్తంగా 300కి పైగా నగరాల్లోని కస్టమర్లకు అమెజాన్ నౌ ను విస్తరించడం ద్వారా భారత్‌లో అతిపెద్ద 'డెలివరీ- ఇన్ -మినిట్స్' నెట్‌వర్క్‌ను నిర్మించే ప్రణాళికలను అమెజాన్ ప్రకటించింది. దేశవ్యాప్తంగా కస్టమర్లకు విక్రేతల ఉత్పత్తుల అతిపెద్ద ఎంపికను ? వారికి అవసరమైనప్పుడు ?

అందించడానికి కంపెనీ తన ప్రత్యేక ఫుల్‌ఫిల్‌మెంట్ మౌలిక సదుపాయా లను నిరంతరం విస్తరిస్తోంది:

వేలాదిఉత్పత్తులు నిమిషాల్లో లేదాకొన్ని గంటల్లో డెలివర్ అవుతాయి, ఒక మిలి యన్‌కు పైగా విస్తృత ఎంపిక అదే రోజు, నాలుగు మిలియన్లకు పైగా మరుసటి రోజు మరియు మిలియన్ల కొద్దీ అపరిమిత, ఉచిత ఖతీతిఎవ డెలివరీతో చేరుకుంటాయి.

ఈ స్టాక్ ధర రూ.2 కంటే తక్కువే.. ఇన్వెస్టర్లకు కాసుల వర్షం..



భారత స్టాక్ మార్కెట్లో ప్రస్తుతం ప్రతికూల పరిస్థితులు, విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ వంటి వంటి కారణాల వల్ల సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. రూపాయి మారకం విలువ పడిపోవడం, ముడి చమురు ధరలు పెరగడం, అమెరికా బాండ్ ఈల్డ్స్ వంటి అనేక కారణాలతో మార్కెట్లు పతనమవుతున్నప్పటికీ, కొన్ని పెన్నీ స్టాక్స్ మాత్రం ఇన్వెస్టర్లకు అద్భుతమైన లాభాలను అందిస్తున్నాయి. అలాంటి వాటిలో 'ఎంపవర్ ఇండియా లిమిటెడ్' ఒకటి. గత ఐదు రోజులుగా ఈ షేరు ధరలో నిరంతరం పెరుగుదల కనిపిస్తోందని, ఈ అయిదు రోజుల్లోనే దాదాపు 30 శాతం వరకు వృద్ధి చెందిందని నివేదికలు చెబుతున్నాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లో ఈ కంపెనీ షేరు సుమారు 5శాతం లాభపడి రూ. 1.91 స్థాయికి చేరుకుంది. లాంగ్ టర్మ్‌లోనూ ఈ షేరు అత్యుత్తమ పనితీరు కనబరిచింది. సరిగ్గా నాలుగేళ్ల క్రితం.. అంటే 2022 నవంబర్ 7న ఈ షేరు ధర కేవలం 15 పైసలుగా ఉండేది. ప్రస్తుతం ఇది రూ. 1.92 వరకు పెరిగి, సుమారు 1,180 శాతం భారీ రాబడిని అందించింది.

ఒకవేళ నాడు ఎవరైనా లక్ష రూపాయలు పెట్టుబడి పెట్టి ఉంటే, వారి పెట్టుబడి విలువ ఇప్పుడు సుమారు రూ. 12.80 లక్షలకు చేరిఉండేది. ఈ షేరు 52 వారాల గరిష్ట ధర రూ. 2.83గా, కనిష్ట ధర రూ. 1.03గా నమోదైంది. ఉదయం షేరు ధర రూ. 1.85 వద్ద ప్రారంభమై, ఇంట్రాడే గరిష్ట స్థాయి అయిన రూ. 1.93ని తాకడంతో పాటు 5 శాతం అప్పర్ సర్క్యూట్‌ను కూడా తాకింది. అయితే? ఇది చాలా తక్కువ ధర కలిగిన పెన్నీ స్టాక్ కావడంతో ఇందులో తీవ్రమైన ఒడుదొడుకులు ఉండే అవకాశం ఉందని, కేవలం గతం ఇచ్చిన పాత రాబడులను చూసి మాత్రమే ఎటువంటి తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా.. ఇన్వెస్ట్ చేసేముందు కంపెనీ వ్యాపార లావాదేవీలు, ఆర్థిక స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఆ ఓటర్లను పోలింగ్ కేంద్రాలకు తీసుకురండి...!




సావో పాలో : జరిగే తుది రౌండ్ ఓటింగ్ కోసం బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డ సిల్వా ప్రచారాన్ని ఉధృతం చేశారు. నాలుగో తేదీన జరిగిన మొదటి రౌండ్ పోలింగ్‌లో ఓటు వేయని వారిని సంప్రదించి, వారిని పోలింగ్ కేంద్రాలకు తీసుకొని వచ్చి తుది విడత ఎన్నికలో ఓటు వేసేలా చూడాలని ఆయన తన మద్దతుదారులకు సూచించారు. 'తమకు ఓటు హక్కు లేదని అనుకుంటున్న ప్రజలతో మనం మాట్లాడాల్సిన అవసరం ఉంది' అని సావో పాలోలో జరిగిన ర్యాలీలో లూలా అన్నారు. తొలి విడత పోలింగ్‌లో లిబరల్ పార్టీకి చెందిన ఫ్లావియో బోల్సొనారోకు 47.03 శాతంఓట్లు లభించగా లూలాకు 45.16 శాతం ఓట్లు వచ్చాయి. అయితే తొలి రౌండ్ పోలింగ్‌లో 21.08 శాతం మంది ప్రజలు ఓటు వేయలేదు.1998 తర్వాత ఓటువేయని వారి సంఖ్య ఈ స్థాయిలో ఉండడం ఇదే ప్రథమం. బ్రెజిల్‌లో 158.7 మిలియన్ల ఓటర్లు ఉండగా తొలి విడత పోలింగ్ కు 33.4 మిలియన్ ఓటర్లు దూరంగా ఉండిపోయారు. అంటే కేవలం 78.92శాతం ఓటింగ్ మాత్రమే జరిగింది. ఈ నేపథ్యంలో తొలి రౌండ్‌లో ఓటు వేయని ఓటర్లపై లూలా దృష్టి సారించారు. విజయం సాధించడానికి అవసరమైన యాభై శాతం ఓట్లను ఇరువురు ప్రధాన అభ్యర్థులు పొందలేకపోవడంతో రెండో రౌండ్ ఓటింగ్ అనివార్యమైంది. విజయం సాధిస్తే తన ప్రాధాన్యతలు ఏమిటో లూలా ఈ ర్యాలీలో వివరించారు. ఏఐలో వృత్తిపరమైన శిక్షణ ఇప్పిస్తామని, డిజిటల్ పరిశ్రమను అభివృద్ధి చేస్తామని, వ్యవస్థీకృత నేరాలను అడ్డుకోవడానికి ప్రజా భద్రతా సంస్కరణలు చేపడతామని ఆయన హామీ ఇచ్చారు.

ఎంఎస్ఎంఈల ఎన్‌పీఏ వర్గీకరణ నిబంధనలను సవరించాలి



సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈలు) కోసం నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) వర్గీకరణ నిబంధనలను పున:సమీక్షించాలని రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ)కు ప్రభుత్వ ముఖ్య ఆర్థిక సలహాదారు (సీఈఏ) వి.అనంత నాగేశ్వరన్ విజ్ఞప్తి చేశారు. అంతర్జాతీయంగా అమలవుతున్న నిబంధనలను అనుసరించడం కంటే, దేశీయ వ్యాపార పద్ధతులు, నగదు ధోరణులకు అనుగుణంగా నిబంధనలు ఉండాలని అభిప్రాయపడ్డారు. ఈఎంఐ లేదా వడ్డీ బకాయిలు పడిన కాలాన్ని బట్టి ఖాతాలను స్పెషల్ మెన్షన్ అకౌంట్లు (ఎస్ఎంఏ)గా వర్గీకరిస్తున్నారు. 90రోజులు దాటితే ఖాతా అధికారికంగా ఎన్‌పీఏగా మారుతుంది. 90 రోజుల కంటే ముందే ఒక చిన్న వ్యాపార ఖాతా ఎస్ఎంఏగా మారిన వెంటనే, ఆ సంస్థ తీవ్రమైన బ్యాంకింగ్, రుణ ఇబ్బందులను ఎదుర్కొంటోందని నాగేశ్వరన్ ఆందోళన వ్యక్తం చేశారు. చిన్న సంస్థలపై తీవ్ర భారం: పెద్ద కార్పొరేట్ సంస్థలతో పోలిస్తే నిబంధనల అమలు భారం చిన్న వ్యాపారాలపైనే అసమానంగా పడుతోందని నాగేశ్వరన్ పేర్కొన్నారు.

ఐసిఐసిఐ లైఫ్ కొత్త సారథిగా సిద్ధార్థ మిశ్రా...



ఐసిఐసిఐ లైఫ్ ఇన్సూరెన్స్ కొత్త మేనేజింగ్ డైరెక్టర్ (ఎండి), చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ (సిఇఒ)గా సిద్ధార్థ మిశ్రాను నియమించింది. ఇప్పటి వరకు ఈ బాధ్యతల్లో ఉన్న అనూప్ బాగ్చీ రాజీనామా చేయడం తో ఆయన స్థానంలో మిశ్రా బాధ్యతలు చేపట్టనున్నారు. ఐఆర్‌డిఎఐ ఆమోదం లభించిన తేదీ నుంచి ఈ నియామకం అమల్లోకి రానుంది. నియంత్రణసంస్థల అనుమతులకు లోబడి ఐదేళ్ల పాటు ఆయన పదవిలో కొనసాగనున్నారు. అంతకుముందే కంపెనీ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్‌గా బాధ్యతలు స్వీకరించనున్నారు. బాగ్చీ రాజీనామా లేఖను బోర్డుకు సమర్పించగా.. వ్యాపార వేళలు ముగిసే సమయానికి ఆయన పదవీకాలం ముగియనుంది. బాగ్చీ త్వరలోనే హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ సిఇఒ బాధ్యతలను స్వీకరించనున్న విషయం తెలిసిందే.

రక్షణ వ్యవస్థలు ఎందుకు విఫలమయ్యాయి? సౌదీ దర్యాప్తు



రియాద్: వరుస దాడులతో సౌదీ అరేబియా ఉక్కిరిబిక్కిరవుతోంది. విమానాశ్రయాలు, ఇంధన మౌలిక సదుపాయాలు, నౌకామార్గాలే లక్ష్యంగా యెమెన్‌కు చెందిన హూతీ తిరుగుబాటుదారులు విరుచుకుపడుతున్నారు. ఇటీవల రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై జరిగిన దాడి లో దాదాపు 13 మంది మృతి చెందగా..

300 మందికిపైగా గాయపడ్డారు. ఈ క్రమంలోనే.. ప్రత్యర్థులు ప్రయోగించిన క్షిపణులు, డ్రోన్లను తమ గగనతల రక్షణ వ్యవస్థలు ఎందుకు అడ్డుకోలేకపోయాయో తెలుసుకునేందుకు సౌదీ అరేబియా దర్యాప్తు ప్రారంభించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. "రియాద్‌లోని అంతర్జాతీయ విమానాశ్రయంపై ప్రయోగించిన క్రూజ్, బాలిస్టిక్ క్షిపణులు లక్ష్యాన్ని ఛేదించేందుకు మార్గం సుగమం చేసేలా.. హూతీలు తొలుత పెద్దసంఖ్యలో డ్రోన్లను ప్రయోగించినట్లు ప్రాథమిక విచారణలో తేలింది" అని అధికారులు తెలిపారు.

ఏపీలో పెండింగ్ మున్సిపల్ ఎన్నికలపై ఫోకస్



విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో పెండింగ్‌లో ఉన్న మిగిలిన కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఎన్నికల నిర్వహణకు రాజ్‌భవన్ సిద్ధమవుతోంది. ఇప్పటికే మేయర్, ఛైర్‌పర్సన్,డివిన్లు, వార్డులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేశారు. ఈ నెల 25లోగా ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. ఏపీ హైకోర్టులో కొన్ని కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు సంబంధించి కేసులు పెండింగ్ ఉన్నాయి. జారీ చేసిన ఎన్నికల నోటిఫికేషన్‌లో ప్రస్తావన లేదు.ఏపీ హైకోర్టులో కేసులు పరిష్కారం కావడంతో ఎన్నికల నిర్వహణకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే డివిజన్లు/వార్డుల పునర్విభజన, ఓటర్ల జాబితాల తయారీ పూర్తి చేశారు. అలాగే మిగిలిన ప్రక్రియను కూడా పూర్తి చేశారు. ఇటీవల రిజర్వేషన్లు కూడా ఖరారు చేసింది. రాష్ట్ర ఎన్నికల సంఘానికి రాష్ట్ర ప్రభుత్వం సమాచారం అందించింది. కార్పొరేషన్లలో మేయర్ పదవులకు సంబంధించి.. శ్రీకాకుళం (జనరల్ మహిళ), రాజమహేంద్రవరం (ఎస్సీ జనరల్), కాకినాడ(బీసీ మహిళ),మంగళగిరి–తాడేపల్లి (ఎస్టీ జనరల్)కి రిజర్వ్ అయ్యాయి.ఈ నాలుగు కార్పొరేషన్లకు సంబంధించి 260 డివిజన్లలో 90 స్థానాలు బీసీలకు రిజర్వ్ చేశారు. ఎస్సీలకు 35, ఎస్టీలకు 5, మహిళలకు 68, అన్ రిజర్వ్‌డ్ కింద 62 ఉన్నాయి. ఆముదాలవలస, రాజాం, భీమవరం, తాడేపల్లిగూడెం,చింతలపూడి, పాలకొల్లు, తణుకు, బి.కొత్తపేట, గుడివాడ, నరసరావుపేట, పొన్నూరు, తాడిగడప, బాపట్ల,పొదిలి, కందుకూరు, అల్లూరు,గూడూరు,కావలి, శ్రీకాళహస్తి మున్సిపాలిటీలు, నగర పంచాయతీల ఛైర్‌పర్సన్ స్థానాలకు ఎన్నికల నిర్వహించనున్నారు. వీటిలోని 749 వార్డులకూ రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

వార్డుల్లో బీసీలకు 231, జనరల్ మహిళకు202, ఎస్సీలకు 106, ఎస్టీలకు 36, రిజర్వ్ అయ్యాయి. మిగిలిన వార్డులు 174వార్డులు అన్ రిజర్వ్‌డ్ అయ్యాయి. మొత్తం మీద స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియ డిసెంబర్ మొదటి వారంలో పూర్తికానున్నాయి. అయితే మధ్యలో సుప్రీం కోర్టు తీర్పు, తుఫాన్ కారణంగా కొంత ఇబ్బందులు ఎదురైనా సరే ప్రక్రియ సాఫీగానే సాగిపోయింది.

మరో కొత్త ఆర్వోబీ..!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్‌లో మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణం వేగం పుంజుకుంది. కేంద్ర ప్రభుత్వం సహకారంతో పలు జాతీయ రహదారుల నిర్మాణాలు, రైల్వే ప్రాజెక్టులు చేపడుతున్నారు. ఈ క్రమంలోనే మరో రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి కేంద్రం నుంచి ఆమోదం లభించింది. విజయవాడ వాంబేకాలనీ వాసుల చిరకాల కోరికను నెరవేరుస్తూ వాంబే కాలనీ– మధురానగర్ మధ్యన రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణానికి రైల్వే శాఖ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో వాంబే కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.ఏపీలో టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పలు మౌలిక వసతుల ప్రాజెక్టులకు మోక్షం కలుగుతున్న సంగతి తెలిసిందే. కేంద్ర ప్రభుత్వం సహకారంతో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న పలు ప్రాజెక్టులలో కదలిక వస్తోంది. ఈ క్రమంలోనే విజయవాడ ఈ కాలనీలో నివసించేపేదలు, కూలీల కల ఎట్టకేలకు నెరవేరనుంది. మధురానగర్ – వాంబేకాలనీ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మించేందుకు కేంద్రం ఆమోదం తెలిపింది. దీంతో త్వరలోనే లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి సంబంధించి అడుగులు పడనున్నా యి.అజిత్ సింగ్ నగర్, వాంబేకాలనీలలో నివసించే కూలీలు, నిరుపేదలు పనుల కోసం విజయవాడ నగరంలోకి రావాలంటే అవస్థ లు పడాల్సి వస్తోంది. సుమారు 50 వేల మంది కూలీలు, కార్మికులు విజయవాడలోకి రావాలంటే వాంబేకాలనీ– దేవీనగర్ మధ్య ఉన్న రైల్వేట్రాక్‌నుదాటాల్సి వస్తోంది. ప్రాణాలు అరచేతిలో పెట్టుకుని నిత్యం ఈ రైల్వేట్రాక్ దాటుతూ రాకపోకలు సాగిస్తున్నారు. విజయవాడ– విశాఖ రైల్వేలైన్ దాటి దేవీనగర్, మధురానగర్ మీదుగా నిత్యం ఎంతోమంది రాకపోకలు సాగిస్తున్నారు. ఈ ట్రాక్ సుమారుగా పది అడుగుల ఎత్తు ఉండటంతో మహిళలు, చిన్నారులు చాలా ఇబ్బందు లు పడాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో పలుసార్లు ప్రమాదాలు కూడా జరిగాయి.దీంతో ఈసమస్యను పరిష్కరించాలని, రైల్వే అండర్ బ్రిడ్జిని నిర్మించాలని స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎంపీ కేశినేని చిన్ని ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఎంపీ కేశినేని శివనాథ్ ఈ అంశం మీద రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌కు లేకూడా రాశారు. ఈ లేఖపై స్పందించిన రైల్వే మంత్రి.. వాంబే కాలనీ– మధురానగర్ మధ్య లిమిటెడ్ హైట్ సబ్ వే నిర్మాణానికి ఆమోదం తెలిపారు. ఈ మేరకు విజయవాడ ఎంపీ కేశినేని చిన్నికి లేఖ ద్వారా సమాచారం అందించారు.లిమిటెడ్ హైట్ సబ్ వే (రైల్వే అండర్ బ్రిడ్జి) నిర్మాణానికి సంబంధించిన డిజైన్, డ్రాయింగ్ పనులు ప్రారంభించామని.. లేఖలో వివరించారుఈ నిర్మాణం పూర్తి అయితే అజిత్ సింగ్ నగర్ ఫ్లైఓవర్ మీద భారం తగ్గుతుంది. అలాగే వేలాది మందికి ప్రయోజనం చేకూరనుంది. మరోవైపు చిరకాల స్వప్నమైన రైల్వే అండర్ బ్రిడ్జి పనులకు కేంద్రం నుంచి గ్రీన్ సిగ్నల్ రావడంతో వాంబే కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు.

వైసీపీ 'సెల్ఫ్ గోల్' వ్యూహం!



విజయవాడ: విజయవాడ మేయర్ ఎన్నికల పోరులో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అనుసరిస్తున్న వ్యూహం ఆ పార్టీ ఉనికిని ప్రశ్నార్థకం చేసేలా ఉంది. టీడీపీ–జనసేన–బీజేపీ కూటమిలో ఎలాగైనా చిచ్చు పెట్టాలనే కుతంత్రంతో.. ఎన్నికల బరిలో ఉన్న మాజీ ఐపీఎస్ అధికారి ఏబీ వెంకటేశ్వరరావుకి వైసీపీ సోషల్ మీడియా, ద్వితీయ శ్రేణి నేతలు పరోక్షంగా పూర్తి మద్దతు ప్రకటిస్తూ ప్రచారం సాగిస్తున్నారు. ఈ ఎన్నికను ఎప్పటిలాగే పాత సామాజిక సమీకరణాలైన కమ్మ వర్సెస్ కాపు పోరుగా మార్చేయాలని చూస్తూ, ప్రధాన పోటీ వంగవీటి వర్సెస్ ఏబీవీ అన్నట్లుగా ఒక కృత్రిమ వాతావరణాన్ని సృష్టించేందుకు తాపత్రయపడుతున్నారు. కూటమి ఐక్యతను దెబ్బతీసి, కాపు–కమ్మ ఓట్లను చీల్చడం ద్వారా కూటమిలో రాజకీయ అగాధాన్ని సృష్టించాలనే కుయుక్తితోనే వైసీపీ ఈ పరోక్ష ప్రచారానికి తెరతీసింది.ఈ వికృత రాజకీయం నడుపుతున్న క్రమంలో వైసీపీ నాయకత్వం ఒక కీలకమైన ప్రాథమిక వాస్తవాన్ని పూర్తిగా విస్మరిస్తోంది. బరిలో స్వయంగా తమ పార్టీ తరఫున అధికారిక అభ్యర్థి ఒకరు పోటీలో ఉన్నారన్న సంగతినే తాడేపల్లి వర్గాలు గాలికొదిలేశాయి. సొంత అభ్యర్థి గెలుపు కోసం వ్యూహాలు రచించి, క్షేత్రస్థాయిలో పార్టీ ఓటర్లను ఏకం చేయాల్సిన వైసీపీ.. ప్రత్యర్థి కూటమిని దెబ్బకొట్టే ఏకైక అజెండాతో స్వతంత్రంగా బరిలో ఉన్న ఏబీవీని భుజానకెత్తుకోవడం వారి రాజకీయ దివాలాకోరుతనానికి నిదర్శనం. గతంలో తమ ప్రభుత్వ హయాంలో ఏబీ వెంకటేశ్వరరావుపై తప్పుడు కేసులు బనాయించి, నిరంతరం వేధించిన వైసీపీ నేతలే.. నేడు రాజకీయ ప్రయోజనాల కోసం ఆయనకు అనుకూలంగా నెరేటివ్ నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారు.క్షేత్రస్థాయి రాజకీయ సమీకరణాలను నిశితంగా పరిశీలిస్తే.. వైసీపీ పన్నిన ఈ వల చివరకు వారికే ఉచ్చుగా మారే స్పష్టమైన సంకేతాలు కనిపిస్తున్నాయి. కూటమి వర్గాల్లో కమ్మ, కాపు సామాజిక వర్గాలతో పాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ ఓటర్లంతా పూర్తి సమన్వయంతో కూటమి అభ్యర్థి వంగవీటి వెంటే ఏకతాటిపై నిలబడుతున్నారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నాయకత్వంలో కూటమి ఓటు బ్యాంకు అత్యంత పటిష్టంగా ఉండటంతో.. ఎంతటి కుల రాజకీయాలు రేపినా కూటమి ఓట్లలో చీలిక తెచ్చే అవకాశమే లేదని తేలిపోయింది. కానీ, వైసీపీ చేస్తున్న పరోక్ష ప్రచారం వల్ల ఆ పార్టీకి చెందిన సంప్రదాయ ఓటర్లు, క్యాడర్ తీవ్ర గందరగోళానికి గురవుతున్నారు.సొంత పార్టీ నాయకత్వమే పరోక్షంగా ఏబీవీకి ప్రాధాన్యం ఇస్తుండటంతో.. వైసీపీ అభ్యర్థిపై నమ్మకం కోల్పోయిన ఆ పార్టీ కేడర్, ద్వితీయ శ్రేణి ఓటర్లు వైసీపీని కాదని నేరుగా ఏబీవీ వైపు మళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అంటే కూటమి ఓట్లను చీల్చాలనుకున్న వైసీపీ పన్నాగం బూమరాంగ్ అయి.. చివరకు వైసీపీ సొంత ఓటు బ్యాంకే ఏబీవీ ఖాతాలోకి వెళ్లి, ఆ పార్టీ అభ్యర్థి డిపాజిట్ కూడా గల్లంతయ్యే దుస్థితి దాపురిస్తోంది. కూటమి ఓట్లన్నీ సంపూర్ణంగా వంగవీటికే దక్కనుండగా.. ఇటు వైసీపీ ఓట్లు రెండుగా చీలిపోయి, ఏబీవీకి దక్కే పరోక్ష మద్దతుతో వైసీపీ సొంత చేతులతోనే తన గొయ్యి తాను తవ్వుకుంటున్న సెల్ఫ్ గోల్ వ్యవహారంగా మారుతోంది.

తెలుగు గంగ నీటిపై చర్చలు



తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా పొరుగు రాష్ట్రమైన ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి వస్తున్న తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్ పర్యటన తెలుగు, తమిళ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ అవుతోంది. ప్రతిష్టాత్మక విజయవాడ ఉత్సవ్ 2.0 సాంస్కృతిక వేడుకల్లో పాల్గొనేందుకు ముఖ్య అతిథిగా విజయ్ విచ్చేస్తున్నప్పటికీ.. ఈ పర్యటనకు చాలాప్రాధాన్యత ఉంది. ఇరు రాష్ట్రాల మధ్య దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న అంతర్రాష్ట్ర సమస్యలపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో విజయ్ ప్రత్యేకంగా చర్చలు జరపనున్నారు ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కూడా సీఎం విజయ్ ముఖాముఖి భేటీ కానున్నారు.ఈ భేటీలో ప్రధానంగా చర్చకు రానున్న అంశం తెలుగు గంగ నీటి పంపకాలు. చెన్నై నగర దాహార్తిని తీర్చేందుకు ఉద్దేశించిన చారిత్రక ఒప్పందం ప్రకారం తమిళనాడుకు సరైన కోటాలో కృష్ణా జలాలు అందడం లేదన్న అసంతృప్తి చెన్నై వర్గాల్లో బలంగా ఉంది. కండలేరు రిజర్వాయర్ నుంచి పూండికి చేరాల్సిన నీటి పరిమాణంలో ఏర్పడుతున్న సాంకేతిక, క్షేత్రస్థాయి అడ్డంకులు, కాల్వల నిర్వహణ, బకాయిలు వంటి సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ ఉన్నత స్థాయి సమావేశం వేదిక కానుంది. తమిళనాడు ప్రజల తాగునీటి అవసరాలకు సంబంధించిన ఈ సున్నితమైన అంశంపై సానుకూల నిర్ణయం తీసుకోవాలని సీఎం విజయ్ ఏపీ ప్రభుత్వాన్ని కోరనుండగా.. పొరుగు రాష్ట్రాలతో సత్సంబంధాలు కాంక్షించే చంద్రబాబు సైతం దీనిపై సానుకూల రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించే అవకాశముంది.నీటి సమస్యలతో పాటు ఈ భేటీకి అత్యంత బలమైన జాతీయ రాజకీయ ప్రాధాన్యత కూడా ఉంది. కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ అత్యంత కీలక భాగస్వామిగా ఉన్న వేళ.. ప్రతిపాదిత లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై దక్షిణాది రాష్ట్రాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జనాభా ప్రాతిపదికన డీలిమిటేషన్ జరిగితే జనాభా నియంత్రణను విజయవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలు పార్లమెంట్‌లో ప్రాతినిధ్యాన్ని కోల్పోతాయన్న భయం నెలకొంది. ఈ కీలక అంశంపై దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా కేంద్రంతో సమన్వయం చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఇప్పటికే ప్రయత్నాలు సాగిస్తున్నారు. విజయ్–చంద్రబాబుల చర్చల్లో డీలిమిటేషన్ అంశం ప్రధాన ఎజెండాగా మారనుందని, దక్షిణాది రాజకీయ స్వరాన్ని ఢిల్లీ వేదికగా బలంగా వినిపించేందుకు ఒక ఉమ్మడి కార్యాచరణపై అభిప్రాయాలు పంచుకునే వీలుందని భావిస్తున్నారు.ఇద్దరు సూపర్ స్టార్లు విజయ్ ? పవన్ కల్యాణ్ భేటీ కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. సినిమా రంగంలో అగ్ర హీరోలుగా వెలుగొంది, ప్రజా సమస్యలపై పార్టీలను స్థాపించి ఎన్నికల సమరంలో విజయం సాధించిన ఈ ఇద్దరు నాయకుల ఆలోచనలు, సిద్ధాంతాలు, దక్షిణాది యువత సాధికారత అంశాలు ఈ చర్చల్లో ప్రస్తావనకు వచ్చే వీలుంది. అటు సాంస్కృతిక ఉత్సవాల్లో పాల్గొంటూనే, ఇటు కీలకమైన అంతర్రాష్ట్ర వివాదాలు, జాతీయ రాజకీయ సమీకరణాలపై విస్తృత చర్చలు జరపడం ద్వారా సీఎం విజయ్ అమరావతి పర్యటన సరికొత్త సమీకరణాలకు నాంది పలికేలా కనిపిస్తోంది.

జెన్ జీకి అనుకూలంగా విజయసాయి అడుగులు



నెల్లూరు: విజయసాయిరెడ్డి పార్టీ ఉద్దేశాలు.. విధివిధానాలను ఆయన అప్పుడప్పుడు సినిమా టీజర్ లాగా విడుదల చేస్తున్నారు.విజయ సాయి రెడ్డి ప్రజలను కాకుండా.. సామాజిక మాధ్యమాలను నమ్ముకున్నారు. తన పార్టీ గురించి.. విధివిధానాల గురించి ఇప్పటివరకు కొన్ని విషయాలు మాత్రమే చెప్పారు. ఇప్పుడు వాటిని బహిరంగంగా బయటపెట్టే క్రమంలో రీల్స్ ను ఉపయోగిస్తున్నారు. జన్ జడ్ మీద పూర్తిగా దృష్టి సారించిన ఆయన.. వారిని ఆకట్టుకునేందుకు రీల్స్ మాత్రమే మార్గమని భావించారు. అందువల్లే రియల్ టైం నుంచి రీల్స్‌టైం లోకి వచ్చేసారు.ఒకప్పుడు విజయసాయిరెడ్డి వైసీపీలో కీలక నాయకుడిగా ఉండేవారు. జగన్ కు దగ్గరగా ఉండేవారు. అయితే ఇప్పుడు ఆ పార్టీ నుంచి బయటికి వచ్చిన తర్వాత సొంత రాజకీయ వేదికను ఏర్పాటు చేసుకుని పనులు నిమగ్నమయ్యారు. అయితే ఆయన రాజకీయాల్లోకి తిరిగి వచ్చిన తీరు.. ప్రజల్లోకి వెళ్లాలి అనుకుంటున్నా ప్రచార పద్ధతులు ఇప్పుడు పూర్తిగా ఆసక్తికరంగా మారాయి. ముఖ్యంగా సోషల్ మీడియా రీల్స్ ద్వారా తన రాజకీయ ఆలోచనలను ఆయన ప్రజల్లోకి తీసుకువెళ్లే ప్రయత్నం చేస్తున్నారు.విజయసాయిరెడ్డి గతంలో రాజ్యసభ సభ్యుడిగా.. వైసిపి జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేశారు. 2025 జనవరిలో రాజ్యసభ సభ్యత్వానికి.. వైసిపి ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా.. క్రియాశీలమైన రాజకీయాలకు దూరంగా ఉంటారని ప్రకటించారు. అయితే ఆ విరామం ఎక్కువ కాలం కొనసాగలేదు. సరిగా ఈ ఏడాది ఆగస్టులో తిరిగి రాజకీయాల్లోకి వస్తున్నట్టు ఆయన ప్రకటించారు. ప్రజల గొంతుకను.. అసెంబ్లీ.. పార్లమెంట్లో వినిపించేందుకు కొత్త పార్టీ ఏర్పాటు చేస్తానని ఆయన వెల్లడించారు.ఏపీ రాజకీయాల్లో కొత్త పార్టీలు రావడం కొత్తేమీ కాదు. కానీ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి రాజకీయాల్లోకి తిరిగి వస్తున్న తీరు మాత్రం ఆసక్తిని కలిగిస్తోంది. ఒకప్పుడు వైసిపి కీలక వ్యూహకర్తగా వ్యవహరించిన ఆయన ఇప్పుడు కొత్త పార్టీ ఏర్పాటు అడుగులు వేస్తున్నారు. అయితే ఈసారి ఆయన రాజకీయ ప్రచారంలో సోషల్ మీడియాకు.. ముఖ్యంగా డిజిటల్ మీడియాకు విపరీతమైన ప్రాధాన్యం ఇస్తున్నారు. రాజకీయాలు మారిపోతున్నాయా.. రాజకీయ ప్రచారం రీల్స్ స్థాయికి చేరుతోందా అరే చర్చ కూడా మొదలైంది. విజయ్ సాయి రెడ్డి గతంలో జగన్ కు అత్యంత సన్నిహితంగా వ్యవహరించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో పార్టీ వ్యవహారాలలో కీలక పాత్ర పోషించారు. రాజ్యసభ సభ్యుడిగా పని చేశారు. అయితే 2025 జనవరిలో ఊహించని విధంగా రాజ్యసభ సభ్యత్వానికి.. వైసీపీకి రాజీనామా చేశారు. ఇకపై రాజకీయాలకు దూరంగా ఉంటారని సంకేతాలు కూడా ఇచ్చారు. కానీ 2020లో మళ్ళీ తన రాజకీయ భవిష్యత్తుపై కీలకమైన ప్రకటనలు చేస్తూ.. సంచలనానికి కారణమయ్యారు.తన రాజకీయ ప్రస్థానంలో కొత్త అధ్యయాన్ని ప్రారంభించాలని విజయ సాయి రెడ్డి అనుకున్నారు. టిడిపి.. వైసిపి వంటి పార్టీలకు ప్రత్యామ్నాయంగా కొత్త రాజకీయ వేదికను ఏర్పాటు చేస్తానని ప్రకటించారు. ప్రజల సమస్యలను అసెంబ్లీ.. పార్లమెంట్ లో వినిపించడమే తన లక్ష్యమని చెప్పారు. తన పార్టీలో యువతకు పెద్దపీట వేస్తానని కూడా వెల్లడించారు. 40 సంవత్సరాల వారికి పార్టీలో అవకాశాల్లో 66% ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. ప్రతి జనవరి 1న ఉద్యోగ క్యాలెండర్ ప్రకటించడం.. ఉద్యోగం వచ్చేవరకు నిరుద్యోగులకు నెలకు పదివేల భృతి ఇచ్చే ప్రతిపాదనను ప్రస్తావించారు..కొత్త పార్టీ ఏర్పాటుకు విజయసాయిరెడ్డి ముహూర్తాన్ని కూడా ప్రకటించారు. నవంబర్ 11న ఉదయం 11 గంటల 11 నిమిషాలకు విజయవాడలోని ఏ కన్వెన్షన్ సెంటర్లో పార్టీ పేరు ప్రకటిస్తానని అక్టోబర్ 20న ఆయన వెల్లడించారు. దీంతో విజయసాయిరెడ్డి కొత్త పార్టీ రాక మీద చర్చ మొదలైంది. ఇప్పటి రాజకీయాల్లో సభలు, సమావేశాలు, ప్రెస్ మీట్లు మాత్రమే సరిపోవడం లేదు.. సోషల్ మీడియా ద్వారా ప్రజలకు వెళ్లడం కూడా ముఖ్యమైనదని.. ముఖ్యంగా యూట్యూబ్ షార్ట్స్..ఇన్ స్టా గ్రామ్ రీల్స్, ఫేస్ బుక్ వీడియో ద్వారా తన ప్రసంగాలను ప్రజలకు తీసుకెళ్లాలని విజయసాయిరెడ్డి భావిస్తున్నారు.

వెలిగల్లు ప్రాజెక్టు నుంచి నీళ్లు విడుదల



రాయచోటి: అన్నమయ్య జిల్లా రాయచోటి నియోజకవర్గం లోని గాలివీడు మండలంలో నిర్మించిన వెలిగల్లు ప్రాజెక్టు నుంచి శుక్రవారం నీళ్లు విడుదల చేశారు.గాలివీడు మండలం గుండ్లచెరువు గ్రామం, దుగ్గనవారిపల్లి గ్రామస్తుల విజ్ఞప్తి మేరకు వెలిగల్లు కుడి కాలువ నుంచి పైపులైన్ ద్వారా చెరువుకు నీటిని పంపింగ్ చేసే కార్యక్రమాన్ని తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ లక్ష్మీ ప్రసాద్ రెడ్డి ప్రారంభించారు. ఈ నీటి సరఫరా ద్వారా చెరువు కింద ఉన్న పంట పొలాలు సాగులోకి వచ్చి, రైతులకు ఎంతో ప్రయోజనం చేకూరనుంది. రైతుల సాగునీటి అవసరాలను తీర్చడంతో పాటు వ్యవసాయ అభివృద్ధికి ఈ కార్యక్రమం దోహదపడనుంది. గ్రామస్తుల విజ్ఞప్తికి స్పందించి సాగునీటి సౌకర్యం కల్పించడంపై స్థానిక రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని సరస్వతిపల్లి గ్రామంలో నాయనివారిపల్లి నుండి ఉడుంవారిపల్లి వరకు దాదాపు 40.00 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న నూతన సిమెంట్ రోడ్డుకు భూమిపూజా చేసిన రాయచోటి నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ "మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి".సరస్వతిపల్లి గ్రామ ప్రజల సౌకర్యం మేరకు నాయనివారిపల్లి నుండి ఉడుంవారిపల్లి వరకు నూతన సిమెంట్ రోడ్డు వేయడం జరుగుతుంది అని పేర్కొన్నారు..ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు సురేంద్ర రెడ్డి టీడీపీ సీనియర్ నాయకులు రమేష్ రెడ్డి, వినోద్ రెడ్డి మరియు పలువురు గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.రాయచోటి (ఎస్.ఎన్. కాలనీ): తెలుగుదేశం పార్టీ కార్యాలయంలోనియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి× 49 మంది లబ్ధిదారులకు సుమారు రూ.47 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కష్టాలను తన కష్టాలుగా భావించి, ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి అండగా నిలుస్తున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో సంక్షేమ పాలన కొనసాగుతోందని పేర్కొన్నారు. అనారోగ్యం, అత్యవసర వైద్య ఖర్చులతో ఇబ్బందులు పడుతున్న పేద కుటుంబాలకు సీఎం సహాయ నిధి ఎంతో భరోసా కల్పిస్తోందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందేలా కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని, ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు. ఆపదలో ఉన్న కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు×బీసీ హాస్టల్ విద్యార్థులకు రూ.2.50 లక్షల విలువైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు వితరణమండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం.క్రమ శిక్షణతో కష్టపడి చదివితేనే ఉన్నత స్థాయికి చేరుకోగలరు విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించాలనే లక్ష్యంతో మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. అన్నమయ్య జిల్లా రాయచోటి పట్టణంలోని బీసీ కాలేజ్ బాలుర వసతి గృహంలో విద్యార్థుల సౌకర్యార్థం రూ.2.50 లక్షల విలువైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లను పంపిణీ చేశారు. ఇటీవల రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి కుమారుడు మండిపల్లి నిశ్చల్ నాగిరెడ్డి జన్మదినం సందర్భంగా బీసీ కాలేజ్ బాలుర వసతి గృహంలోని విద్యార్థులకు అవసరమైన పరుపులు, దిండ్లు, బెడ్‌షీట్లు అందించాలని కోరగా, వారి విజ్ఞప్తి మేరకు మండిపల్లి నాగిరెడ్డి ట్రస్ట్ ఈ కార్యక్రమానికి ముందుకొచ్చింది. ట్రస్ట్ ఆధ్వర్యంలో అందించిన వస్తువులను హాస్టల్ వార్డెన్ శ్రీనివాసులు, టీడీపీ నాయకులతో కలిసి నియోజకవర్గ టీడీపీ నాయకుడు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి విద్యార్థులకు అందజేశారు.ఈ సందర్భంగా డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు తమ వంతు సహకారంగా ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. సమాజం పట్ల సామాజిక బాధ్యతతో ప్రతి ఒక్కరూ ముందుకొచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు.విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ, క్రమశిక్షణతో కష్టపడి చదవాలని సూచించారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించినప్పుడే జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోగలరని పేర్కొన్నారు.

కనిపించని అధికార పార్టీ ప్రభావం?!




వరంగల్: వచ్చే ఏడాది మార్చిలో జరగనున్న రెండు పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానాల ఎన్నికలు రాష్ట్ర రాజకీయాల్లో ఉత్కంఠ రేపుతున్నాయి. వరంగల్–ఖమ్మం–నల్గొండ, మహబూబ్‌నగర్– రంగారెడ్డి–హైదరాబాద్ నియోజకవర్గాలను కైవసం చేసుకోవడం ద్వారా తమ రాజకీయ ఆధిపత్యాన్ని చాటాలని అధికార కాంగ్రెస్ పార్టీ భావిస్తోంది. ఇప్పటికే మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ స్థానానికి సామ రామ్మోహన్ రెడ్డిని, వరంగల్– ఖమ్మం– నల్గొండ స్థానానికి రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డిని అభ్యర్థులుగా ప్రకటించి ముందడుగు వేసింది. అయితే ఓటరు నమోదు ప్రక్రియలో మాత్రం కాంగ్రెస్ పార్టీ బాగా వెనుకబడినట్లు వార్తలు అందుతున్నాయి.ఎన్నికల పోరులో గెలుపోటములను ప్రభావితం చేసే అత్యంత కీలకమైన ఓటరు నమోదు ప్రక్రియ ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీలో చర్చనీయాంశంగా మారింది. పట్టభద్రుల ఓటరు నమోదుకు చివరి తేదీగా ఎన్నికల అధికారులు ప్రకటించారు. ఈ గడువు ముగిసినప్పటికీ, నామినేషన్ల దాఖలుకు చివరి తేదీ వరకు ఫారం–18 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని అఖా స్పష్టం చేశారు. గతంలో ఓటర్లుగా ఉన్నవారు సైతం మళ్లీ కొత్తగా దరఖాస్తు చేసుకోవాలన్న నిబంధన ఉండటంతో, పెద్ద ఎత్తున అర్హులను నమోదు చేయించడం పార్టీల ముందున్న అతిపెద్ద సవాలు.ఎమ్మెల్సీ ఎన్నికలను అత్యంత సీరియస్‌గా తీసుకున్న సీఎం రేవంత్ రెడ్డి, ఓటరు నమోదుపై ప్రారంభం నుంచే పార్టీ శ్రేణులను అప్రమత్తం చేస్తూ వస్తున్నారు. నిరుద్యోగులు, ఉద్యోగులు, యువతను పెద్ద సంఖ్యలో భాగస్వామ్యం చేసి బలమైన ఓటు బ్యాంకును సృష్టించుకోవాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. అయినా, క్షేత్రస్థాయిలో కాంగ్రెస్ కేడర్ ఆశించిన స్థాయిలో వేగం పుంజుకోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. పార్టీ నాయకత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా ఓటర్లను నమోదు చేయించడంలో కొంత నిర్లిప్తత ప్రదర్శించినట్లు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఇతర పార్టీలతో పోలిస్తే, అధికారంలో ఉన్నప్పటికీ క్షేత్రస్థాయిలో ఆశించినంతగా గ్రౌండ్ వర్క్ జరగలేదన్న గుసగుసలు పార్టీ వర్గాల్లోనే చర్చనీయాంశమయ్యాయి. ఓటరు నమోదులో కేడర్ వెనుకబడిందన్న వార్తలు, నివేదికలు అధిష్టానాన్ని అప్రమత్తం చేశాయి. దీంతో చివరి గడువు సమీపిస్తున్న తరుణంలో కాంగ్రెస్ నాయకత్వం మరింత దూకుడు పెంచింది. పార్టీ శ్రేణులకు మరోసారి గట్టి హెచ్చరికలు జారీ చేస్తూ, మిగిలిన సమయంలోనైనా వేగంగా దరఖాస్తులు పూర్తి చేయించాలని ఆదేశించింది. కాలేజీలు, యూనివర్సిటీలు, ఉద్యోగ సంఘాలు, పట్టభద్రులూ అధికంగా ఉండే ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించింది.నవంబర్ 25న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల కానుండగా, ఆ తర్వాత డిసెంబర్ 10 వరకు అభ్యంతరాల స్వీకరణ, డిసెంబర్ 30న తుది జాబితా ప్రచురణ ఉంటుంది. తుది జాబితా వచ్చే వరకు కూడా దరఖాస్తులకు అవకాశం ఉన్నప్పటికీ.. ప్రారంభ దశలో జరిగిన జాప్యాన్ని పూడ్చడంపైనే ఇప్పుడు పార్టీ దృష్టి కేంద్రీకృతమైంది.గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవాలంటే పార్టీ బలం ఒక్కటే సరిపోదు. వ్యక్తిగత ప్రభావం, మేధావుల నాడిని పట్టడం చాలా ముఖ్యం. ఈ ఎన్నికల్లో విజయం సాధిస్తే ప్రభుత్వ విధానాలకు ప్రజామద్దతు ఉందని భావించడానికి ఒక బలమైన సంకేతం దొరుకుతుంది. అయితే, ఓటరు నమోదు ప్రక్రియలో ప్రారంభంలో ఎదురైన ఆటంకాలు, కేడర్ నుంచి రావాల్సినంత స్పందన రాకపోవడం వంటి పరిణామాలు కాంగ్రెస్ అభ్యర్థుల విజయ అవకాశాలపై ఏ మేరకు ప్రభావం చూపుతాయో వేచి చూడాలి.

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు కొత్త కళ..



హైదరాబాద్, : సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునరాభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రూ.714.73 కోట్లతో పనులు చేపట్టగా.. ఇప్పటివరకు 71 శాతం పూర్తయ్యాయి. ఉత్తర, దక్షిణ వైపుల ఐకానిక్ భవనాలు, రెండు అంతస్తుల ఎయిర్ కాన్‌కోర్స్, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ట్రావలేటర్లతో ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, మల్టీలెవల్ కార్ పార్కింగ్, మెట్రో స్కైవాక్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నారు. కొన్ని కీలక నిర్మాణాలు ఇప్పటికే పూర్తయ్యాయి. మిగిలిన పనులు వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తయ్యే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు.దేశంలోనే అత్యంత రద్దీగా ఉండే రైల్వే జంక్షన్లలో ఒకటైన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ రూపురేఖలు మారనున్నాయి. ప్రయాణికులకు అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో చేపట్టిన సమగ్ర పునరాభివృద్ధి పనులు వేగంగా కొనసాగుతున్నాయి. మొత్తం రూ.714.73 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టులో ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరితగతిన పూర్తి చేసేందుకు దక్షిణ మధ్య రైల్వే అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది చివరి నాటికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ.. కొన్ని నిర్మాణాలు అసంపూర్తిగా ఉండటం వల్ల వచ్చే ఏడాది మార్చి నాటికి మొత్తం ప్రాజెక్టు అందుబాటులోకి వచ్చే అవకాశముందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ పనులు పూర్తయితే సికింద్రాబాద్ స్టేషన్ ఆధునిక రవాణా కేంద్రంగా కొత్త రూపును సంతరించుకోనుంది.సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ మీదుగా ప్రతిరోజూ సుమారు 180 రైళ్లు రాకపోకలు సాగిస్తున్నాయి. నిత్యం లక్షన్నర మందికిపైగా ప్రయాణికులు ఈ స్టేషన్‌ను వినియోగిస్తున్నారు. నగర జనాభా, రైళ్ల సంఖ్య, ప్రయాణికుల రద్దీ భవిష్యత్తులో మరింత పెరిగే అవకాశాలను దృష్టిలో ఉంచుకుని భారీ స్థాయిలో మౌలిక వసతులను అభివృద్ధి చేస్తున్నారు. ఇందులో భాగంగా స్టేషన్‌కు ఉత్తరం, దక్షిణం వైపున ఆకర్షణీయమైన ఐకానిక్ భవనాలను నిర్మిస్తున్నారు. రెండు అంతస్తుల భారీ ఎయిర్ కాన్‌కోర్స్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ప్రయాణికులు ప్లాట్‌ఫారాలపై వర్షం, ఎండ ఇబ్బందులు లేకుండా రాకపోకలు సాగించేందుకు పూర్తిస్థాయి రూఫింగ్ నిర్మిస్తున్నారు.ప్రయాణికుల రాకపోకలను సులభతరం చేసేందుకు ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు. వీటితో పాటు ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్ సదుపాయాన్ని కల్పిస్తున్నారు. మెట్రో రైల్వే స్టేషన్‌కు నేరుగా అనుసంధానం కల్పించేలా స్కైవాక్ నిర్మాణం చేపడుతున్నారు. దీనివల్ల రైలు దిగిన ప్రయాణికులు బయటకు వచ్చి రహదారులు దాటాల్సిన అవసరం లేకుండా మెట్రోకు చేరుకునే అవకాశం ఉంటుంది. ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్, మెరుగైన ప్రయాణికుల సౌకర్యాలు కూడా ప్రాజెక్టులో భాగంగా ఉన్నాయి.ఇప్పటివరకు 71 శాతం పనులు పూర్తికాగా.. మిగిలిన 29 శాతం పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేస్తున్నారు. ప్రస్తుతం ఉత్తర, దక్షిణ ప్రధాన స్టేషన్ భవనాలు, ఉత్తరం వైపు మల్టీలెవల్ కార్ పార్కింగ్, బేస్‌మెంట్, ఎయిర్ కాన్‌కోర్స్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. హైదరాబాద్ ఎండ్ ఫుట్‌ఓవర్ బ్రిడ్జి, ప్లాట్‌ఫారాలపై రూఫింగ్, ఒకటి, పది నంబర్ ప్లాట్‌ఫారాల వద్ద ట్రావలేటర్లతో కూడిన వంతెనలు, మెట్రో స్కైవాక్ అనుసంధాన పనులు కూడా పురోగతిలో ఉన్నాయి. వీటితోపాటు ప్లాట్‌ఫారాలపై ఆధునిక ఫ్లోరింగ్ పనులను పూర్తి చేసే దిశగా చర్యలు చేపట్టారు.ప్రాజెక్టులో భాగంగా కొన్ని కీలక పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కోసం నూతన భవనాన్ని నిర్మించారు. కాజీపేట వైపు కొత్త ఫుట్‌ఓవర్ బ్రిడ్జి అందుబాటులోకి వచ్చింది. దక్షిణం వైపు స్టేషన్ భవనంలో గ్రౌండ్ ఫ్లోర్‌లోని రాకపోకల విభాగాలు, ప్రయాణికుల రాక, బయలుదేరే ప్రాంతాల నిర్మాణం పూర్తయింది. దక్షిణం వైపు బేస్‌మెంట్, ఎలక్ట్రికల్ సబ్‌స్టేషన్ పనులు కూడాముగిశాయి. ఈ ప్రాజెక్టు పూర్తయితే రైలు, మెట్రో, రోడ్డు రవాణా మధ్య అనుసంధానం మరింత మెరుగుపడటంతోపాటు ప్రయాణికులకు సౌకర్యవంతమైన ప్రయాణ అనుభూతి లభించనుంది.

నాగార్జునసాగర్ వరద కాల్వలో విష రసాయనాలు..!?



నల్గొండ: నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలోని నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు రంగు మారడం, జలచరాలు చనిపోయి తేలడంతో స్థానికులు ఆందోళనకు గురయ్యారు. ఆదివారం తెల్లవారుజామున గుర్తుతెలియని వ్యక్తులు ట్యాంకర్లతో రసాయనాలు పారబోసినట్లు అనుమానిస్తున్నారు. ఈ కాల్వ ద్వారా జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగు, సాగునీరు అందుతోంది. నీటిపారుదల శాఖ అధికారులు కాల్వను పరిశీలించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ట్యాంకర్లను గుర్తించేందుకు పోలీసులు సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలిస్తున్నారు. రసాయనాల స్వరూపం, నీటిపై వాటి ప్రభావం ఇంకా తెలియాల్సి ఉంది.నల్గొండ జిల్లా పెద్దవూర మండలంలో నాగార్జునసాగర్ వరదకాల్వలో నీరు అకస్మాత్తుగా రంగు మారడం స్థానికంగా కలకలం రేపింది. గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం తెల్లవారుజామున ట్యాంకర్ల ద్వారా కాల్వలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. రసాయనాలు కలవడంతో కాల్వలోని నీటి రంగు మారడమే కాకుండా.. జలచరాలు చనిపోయి నీటిపై తేలడంతో పరిస్థితి తీవ్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తాగునీరు, సాగునీటి అవసరాలకు ఉపయోగించే కాల్వలో ఈ ఘటన చోటుచేసుకోవడం ప్రజల్లో భయాందోళనలకు కారణమైంది. నాగార్జునసాగర్ వరదకాల్వ ద్వారా నల్గొండ జిల్లాలోని ఎనిమిది మండలాలకు తాగునీరు, సాగునీరు అందుతోంది. ఇలాంటి కీలకమైన నీటి వనరులో గుర్తుతెలియని రసాయనాలు కలవడం స్థానికంగా ఆందోళన కలిగిస్తోంది. కాల్వ నీటిపై ఆధారపడే ప్రజలు, రైతుల అవసరాల దృష్ట్యా ఘటనపై సమగ్ర విచారణ జరిపి, నీటి నాణ్యతను పరిశీలించాల్సిన అవసరం ఏర్పడింది. అయితే, కాల్వలో కలిసిన రసాయనాలు ఏంటి, వాటి ప్రభావం ఎంతవరకు ఉంటుందనే అంశాలు ఇంకా స్పష్టతకు రావాల్సి ఉంది.సమాచారం అందుకున్న నీటిపారుదల శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకుని కాల్వ పరిసరాలను పరిశీలించారు. దాదాపు అర కిలోమీటరు మేర కాల్వను పర్యవేక్షించారు. కోదాడ?జడ్చర్ల జాతీయ రహదారికి సమీపంలోని కొత్తగూడెం ప్రాంతంలో, కాల్వకు సుమారు 15 మీటర్ల దూరంలో రసాయనాలను పారబోసినట్లు గుర్తించినట్లు నీటిపారుదల శాఖ ఏఈ మల్లయ్య తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు.మరోవైపు.. కాల్వలో రసాయనాలు పారబోసిన వ్యక్తులను గుర్తించేందుకు పోలీసులు చర్యలు చేపట్టారు. వరదకాల్వ వెంట గస్తీని పెంచడంతోపాటు, పరిసర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల దృశ్యాలను పరిశీలించి ట్యాంకర్లను గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు పెద్దవూర ఎస్సై గోపాల్‌రావు తెలిపారు. రసాయనాలను ఎవరు, ఎందుకు పారబోశారనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. తాగు, సాగునీటికి ఉపయోగించే జలవనరుల్లో రసాయన వ్యర్థాలను పారబోయడం ప్రజారోగ్యంతోపాటు పర్యావరణానికి కూడా ముప్పుగా మారే అవకాశం ఉందని పోలీసులు చెబుతున్నారు.ఘటనకు బాధ్యులను గుర్తించి చర్యలు తీసుకోవడంతోపాటు, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా నీటి వనరుల పరిసరాల్లో పర్యవేక్షణను మరింత పటిష్ఠం చేస్తామని చెబుతున్నారు.

కాంగ్రెస్ లో మారని తీరు!



హైదరాబాద్, : కాంగ్రెస్ పార్టీది అధికారంలో ఉన్నా, లేకపోయినా ఒకటే తీరు. అంతర్గత కుమ్ములాటలు పార్టీ ప్రతిష్టను మరింత దిగజారుస్తున్నాయి. అధికారంలో ఉన్నామన్న స్పృహ కూడా నేతల్లో లేకపోవడం విచారకరం. మంత్రుల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలు ఎవరూ దీనికి మినహాయింపు కాదు.తెలంగాణలో అధికార కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల మధ్య విభేదాలు బహిరంగంగా రగులుతున్నాయి. ఎన్ని సార్లు క్రమశిక్షణ కమిటీ ముందుకు వచ్చినప్పటికీ ఫలితం మాత్రం లేదు. ఇంకా కుమ్ములాటలు, కొట్లాటలు, విమర్శలు, ప్రతి విమర్శలతో తమకు తామే పార్టీని నాశనం చేస్తున్నారు. కార్యకర్తల మనోభావాలను దెబ్బతీస్తూ పదవులను పొందిన వారే ఈ పనులకు పాల్పడుతుంటంతో హస్తం పార్టీని ఎవరూ రక్షించలేరన్నది అర్థమయింది. ప్రజలకు చికాకు కలిగించేలా వీరి పోకడలు నేటికీ కొనసాగుతున్నాయి. ఢిల్లీలో జరిగిన 'ఓట్ చోరీ' ర్యాలీ సమయంలో మంత్రి కి, ఎమ్మెల్యే కు మధ్య ఒక ఫైవ్ స్టార్ హోటల్‌లో తీవ్ర వాగ్వాదం జరిగింది. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తదితర పదవుల నియామకాల విషయంలో వీరిద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుందని చెబుతన్నారు. దీంతో మంత్రిపై టీపీసీసీ నాయకత్వానికి, ఏఐసీసీకి ఫిర్యాదు చేశారు. ప్రస్తుతం పీసీసీ పరిధిలో విచారణ జరుపుతున్నారు. ఈ వివాదం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పార్టీ పరువు బజారున పడినట్లయింది. గాంధీ భవన్ లో నేత అంటే ఓర్పు, సంయమనం పాటించాల్సిన సమయంలో కాంగ్రెస్ నేతలు కొట్లాటలకు దిగడమేంటన్న ప్రశ్న తలెత్తుతుంది. ఇది పార్టీకి ఇబ్బందికరంగా మారనుంది. పార్టీలో క్రమశిక్షణ లోపానికి ఈ ఘటన అద్దం పడుతుందన్నది పార్టీ నేతలే అంటున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే జె. అనిరుధ్ రెడ్డి పెండింగ్‌లో ఉన్న సుమారు రూ. 40 కోట్ల అభివృద్ధి బిల్లులు విడుదల కాకపోతే 30 వేల మందితో నిరాహార దీక్షకు దిగుతానని హెచ్చరించారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డితో పాటు మరికొందరు ఎమ్మెల్యేలు కూడా నిధుల కేటాయింపులు, టెండర్ల తీరుపై అసంతృప్తి వెళ్లగక్కారు. పెద్దపల్లి ఎంపీ వంశీ కృష్ణ ప్రభుత్వ, పార్టీ కార్యక్రమాల్లో తనకు ప్రోటోకాల్ ఇవ్వడం లేదని, తనను పక్కన పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మంథని నియోజకవర్గంలో గిరిజన మహిళా నేత సస్పెన్షన్‌పై ఆయన అభ్యంతరం తెలిపారు. దీనిపై టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేష్ కుమార్ గౌడ్ స్పందించి, పార్టీలోని ప్రతి ఒక్కరితో మాట్లాడి విభేదాలను సరిదిద్దుతామని తెలిపారు. మరోవైపు ఈ అంతర్గత కుమ్ములాటల వల్ల పరిపాలన గాడి తప్పుతోందని ప్రతిపక్షాలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తున్నాయి

ఓలా, ఉబర్ లకు దీటుగా విన్ గ్రూప్ !

హైదరాబాద్ : తెలంగాణలో ఎలక్ట్రిక్ మొబిలిటీని ప్రోత్సహించడంతోపాటు విదేశీ పెట్టుబడులను ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా 2025 డిసెంబరు 9న తెలంగాణ ప్రభుత్వం, వియత్నాంకు చెందిన విన్‌గ్రూప్ మధ్య సుమారు 3 బిలియన్ డాలర్ల పెట్టుబడులకు అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందంలో భాగంగా ఎలక్ట్రిక్ మొబిలిటీ, క్యాబ్ సేవలు, ఛార్జింగ్ కేంద్రాలు, స్మార్ట్ సిటీ అభివృద్ధి వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. విన్‌గ్రూప్‌లో భాగమైన గ్రీన్ ఎస్ఎం ప్రధానంగా ఎలక్ట్రిక్ వాహనాలతో రవాణా సేవలను నిర్వహిస్తోంది. ఇప్పటికే 2026 జూన్ 5న ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో వెయ్యి ఎలక్ట్రిక్ కార్లతో కార్యకలాపాలు ప్రారంభించింది. భవిష్యత్తులో వాహనాల సంఖ్యను 10 వేలకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్‌లోనూ ఈ సంస్థకు చెందిన కార్లు కనిపిస్తుండటంతో స్థానికంగా కార్యకలాపాల విస్తరణపై ఆసక్తి నెలకొంది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో గ్రీన్ ఎస్ఎం క్యాబ్స్ కిలోమీటర్‌కు రూ.9 చొప్పున ఛార్జీ వసూలు చేస్తున్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. హైదరాబాద్‌లో ఓలా, ఉబెర్ వంటి సంస్థల్లో సాధారణంగా కిలోమీటర్‌కు రూ.15 నుంచి రూ.20 వరకు ప్రయాణ ఛార్జీలు ఉంటున్నాయి. అయితే ట్రాఫిక్, ప్రయాణ దూరం, డిమాండ్, వాహనం రకాన్ని బట్టి ఈ ధరలు మారుతుంటాయి. ఈ సంస్థలు డ్రైవర్ల ఆదాయం నుంచి 20 నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. మరోవైపు ర్యాపిడో క్యాబ్స్ రోజువారీ సబ్‌స్క్రిప్షన్, చిన్న పాస్‌ల విధానం ద్వారా జీరో కమిషన్ మోడల్‌ను కూడా అందిస్తోంది. ఉదాహరణకు రోజుకు రూ.3 వేల గ్రాస్ ఆదాయం వచ్చే క్యాబ్ డ్రైవర్ కంపెనీ కమిషన్ లేదా సబ్‌స్క్రిప్షన్ కింద రూ.100 నుంచి రూ.600 వరకు చెల్లించాల్సి వస్తోంది. పెట్రోల్, సీఎన్‌జీ కోసం రూ.700 నుంచి రూ.900, నిర్వహణ, టోల్ ఛార్జీల కోసం మరో రూ.200 నుంచి రూ.300 ఖర్చవుతున్నాయి. ఇవన్నీ పోను రోజుకు రూ.1,200 నుంచి రూ.1,600 వరకు మాత్రమే డ్రైవర్‌కు మిగులుతున్నట్లు అంచనా. ఈ పరిస్థితుల్లో గ్రీన్ ఎస్ఎం తక్కువ ధరలకు క్యాబ్ సేవలు అందిస్తే ప్రయాణికులు అటువైపు మళ్లే అవకాశం ఉందని డ్రైవర్లు భావిస్తున్నారు.తెలంగాణ గిగ్ వర్కర్స్ యూనియన్ 2026 ఫిబ్రవరిలో వెల్లడించిన వివరాల ప్రకారం రాష్ట్రంలో సుమారు 1.5 లక్షల మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి హైదరాబాద్‌కు వచ్చి పనిచేస్తున్న వారు మరో 15 వేల మంది వరకు ఉన్నట్లు డ్రైవర్లు చెబుతున్నారు. కొత్త సంస్థ తక్కువ ఛార్జీలతో మార్కెట్‌లోకి వస్తే ఈ భారీ డ్రైవర్ వ్యవస్థపై ఎలాంటి ప్రభావం ఉంటుందన్నది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతం ఓలా, ఉబెర్ డ్రైవర్లు తమకు అనుకూలమైన సమయంలో యాప్‌లో లాగిన్, లాగౌట్ అయ్యే వెసులుబాటు కలిగి ఉన్నారు. కానీ గ్రీన్ ఎస్ఎం విధానంలో డ్రైవర్లను సంస్థ నేరుగా నియమించుకుని, కార్పొరేట్ ఉద్యోగుల తరహాలో నిర్ణీత పని గంటలు, సంస్థ నిబంధనల ప్రకారం పనిచేయించనున్నట్లు తెలుస్తోంది.ఢిల్లీలో సంస్థ కార్యకలాపాల తరహాలో హైదరాబాద్‌లోనూ తొలి విడతలో వెయ్యి కార్లను ప్రవేశపెడితే ఒక్కో వాహనానికి ఒకటి లేదా రెండు షిఫ్టుల చొప్పున సుమారు వెయ్యి నుంచి 2 వేల మంది డ్రైవర్లు అవసరమవుతారని అంచనా. సంస్థ సొంతంగా డ్రైవర్లను నియమించుకునే విధానం అనుసరించనుంది. ఢిల్లీ కార్యకలాపాలకు సంబంధించి రోజుకు 12 గంటలు పనిచేస్తే నెలకు రూ.35 వేల జీతం ఇస్తున్నట్లు తెలిసింది. అయితే ఈ ఆదాయాన్ని పొందేందుకు డ్రైవర్లకు కఠినమైన నిబంధనలు విధిస్తున్నట్లు సమాచారం. కేటాయించిన రైడ్లలో కనీసం 90 శాతం అంగీకరించి పూర్తి చేయాలి. కస్టమర్ల నుంచి 4.8 రేటింగ్ సాధించాలి. బుక్ చేసిన ప్రయాణాన్ని మధ్యలో రద్దు చేయడానికి వీల్లేదు. ఢిల్లీలోని కొందరు డ్రైవర్లు ఈ నిబంధనలపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ట్రాఫిక్ రద్దీ, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడం, 10 నుంచి 12 గంటల పాటు నిరంతరంగా డ్రైవింగ్ చేయడం వల్ల అలసటకు గురవుతున్నామని చెబుతున్నారు. ఛార్జింగ్ కేంద్రాలు అందుబాటులో లేక సమయం వృథా అవుతోందని, ఆదాయ హామీ, చెల్లింపుల విషయంలోనూ సమస్యలు ఎదురవుతున్నాయని వాపోతున్నారు.

భాగ్యనగర్ లో నీటి కష్టాలు

హైదరాబాద్: హైదరాబాద్‌లో నీటి సరఫరా సమస్య పలు రంగాలను ప్రభావితం చేస్తోంది. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్ కారణంగా నగరంలోని హాస్టళ్లకు నీరు అందక విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోతే హాస్టళ్లను మూసివేస్తామని యజమానులు హెచ్చరిస్తున్నారు. నీటి కొరతతో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను ఇళ్లకు పంపిస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. మరోవైపు అక్రమ బోర్లపై హైడ్రా చర్యలు, స్థానికుల ఫిర్యాదులు కొనసాగుతున్నాయి. అపార్ట్‌మెంట్లలోనూ నీటి సరఫరాను కొన్ని గంటల పాటు నిలిపివేస్తున్నట్లు నోటీసులు వెలువడుతున్నాయి. నీటి వనరులను కాపాడుతూనే ప్రజలకు ప్రత్యామ్నాయ సరఫరా కల్పించాలనే డిమాండ్ పెరుగుతోంది.హైదరాబాద్‌లో నీటి కొరత రోజురోజుకూ తీవ్ర రూపం దాల్చుతోంది. ఒకవైపు ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయన్న ఆందోళన వ్యక్తం అవుతుండగానే.. మరోవైపు ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానుల బంద్‌తో నగరంలోని పలు ప్రాంతాల్లో నీటి సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ఈ పరిణామం హాస్టళ్లు, అపార్ట్‌మెంట్లు, విద్యాసంస్థలపై తీవ్ర ప్రభావం చూపిస్తోంది. నీరు అందుబాటులో లేక విద్యార్థులు, ఉద్యోగులు, నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అమీర్‌పేట్‌లోని ప్రైవేట్ హాస్టళ్లకు వాటర్ ట్యాంకర్ల సరఫరా నిలిచిపోవడంతో యజమానులు ఆందోళనకు దిగారు. ఎస్ఆర్ నగర్‌లోని వాటర్ వర్క్స్ కార్యాలయానికి వెళ్లిన అమీర్‌పేట్ వెల్ఫేర్ హాస్టల్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజారావు, ఇతర సభ్యులు జనరల్ మేనేజర్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. గత 2 రోజులుగా నీరు అందక హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు.ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ప్రైవేట్ ట్యాంకర్ల సరఫరా నిలిపివేయడంతో పరిస్థితి మరింత క్లిష్టంగా మారిందని హాస్టల్ యజమానులు పేర్కొన్నారు. అధికారులను సంప్రదించినా హైడ్రా ఆదేశాల నేపథ్యంలో తామేమీ చేయలేమని చెబుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ప్రత్యామ్నాయ నీటి సరఫరా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమస్య పరిష్కారం కాకపోతే గురువారం నుంచి హాస్టళ్లను మూసివేయాల్సి వస్తుందని తీవ్ర హెచ్చరికలు చేశారు. అవసరమైతే నగరవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్పష్టం చేశారునీటి కొరత ప్రభావం కార్పొరేట్ విద్యాసంస్థలపైనా పడుతోంది. పెద్ద సంఖ్యలో విద్యార్థులు హాస్టళ్లలో ఉంటూ చదువుకునే కాలేజీలకు రోజూ భారీగా నీరు అవసరం అవుతుంది. తాగునీటితో పాటు స్నానాలు, వంట, ఇతర అవసరాలకు సరిపడా నీరు అందకపోవడంతో హాస్టళ్ల నిర్వహణ కష్టంగా మారుతోంది. ట్యాంకర్ల ద్వారా నీటిని తెప్పించుకునే ప్రయత్నాలు చేసినా అవసరాలకు తగినంత సరఫరా లభించడం లేదని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని విద్యాసంస్థలు విద్యార్థులను తాత్కాలికంగా ఇళ్లకు పంపించే నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.తల్లిదండ్రులకు సమాచారం అందించి వారి పిల్లలను ఇళ్లకు తీసుకెళ్లాలని సూచిస్తున్నాయి. దీంతో విద్యార్థులతో కళకళలాడే కొన్ని కాలేజీ క్యాంపస్‌లు, హాస్టళ్లు ఖాళీ అవుతున్నాయి. నీటి సమస్య ఎప్పుడు పరిష్కారమవుతుందో, విద్యాసంస్థలు తిరిగి ఎప్పుడు ప్రారంభమవుతాయోనని విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.మరోవైపు.. ప్రైవేట్ వాటర్ ట్యాంకర్ల యజమానులు చేపట్టిన బంద్ నగరంలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. రెవెన్యూ, హైడ్రా అధికారులు తమ బోర్లపై చర్యలు తీసుకుంటున్నారని.. ఎలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా బోర్లు తొలగించడం వల్ల ఉపాధి కోల్పోతున్నామని ట్యాంకర్ల యజమానులు ఆరోపణలు చేస్తున్నారు. బంద్‌లో భాగంగా రోడ్లపైకి వచ్చిన కొన్ని ట్యాంకర్లను అడ్డుకోవడంతో పాటు.. ట్యాంకర్లలోని నీటిని రోడ్లపైనే పారబోసి నిరసన తెలపడంతో.. నీటి కొరత వేళ.. ట్యాంకర్ నీళ్లను వృథా చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

మళ్లీ బండి సంజయ్‌కు పగ్గాలు!



కరీంనగర్, : రాజకీయాల్లో మరోసారి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి చుట్టూ ఆసక్తికర పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని నెలల కిందట పార్టీ పగ్గాలు చేపట్టిన ఎన్. రామచంద్రరావును మహబూబ్‌నగర్– రంగారెడ్డి– హైదరాబాద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా అధిష్టానం దాదాపు ఖరారు చేసింది. దీంతో రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు తిరిగి ఎంపీ బండి సంజయ్ చేతికి వెళ్లనున్నాయనే ఊహాగానాలు రాజకీయ వర్గాల్లో జోరుగా వినిపిస్తున్నాయి. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉండేవారు. అప్పట్లో బీజేపీ దూకుడు ఊహించని స్థాయిలో ఉండేది. ఆయన చేపట్టిన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఆ సమయంలో పార్టీ కేవలం జాతీయ స్థాయి పార్టీగానే కాకుండా, అధికార బీఆర్ఎస్‌కు ఏకైక ప్రత్యామ్నాయ శక్తిగా ఎదిగింది. దుబ్బాక, హుజూరాబాద్ ఉప ఎన్నికల్లో చారిత్రాత్మక విజయాలు సాధించడంతో పాటు, జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ ఊహించని విధంగా ప్రతిపక్ష స్థానాన్ని దక్కించుకుని సంచలనం సృష్టించింది. సంజయ్ అనుసరించిన దూకుడు రాజకీయ శైలి, ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేసే తీరు పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేశాయి. అయితే, ఆయన దూకుడుతో పార్టీలో అంతర్గతంగా కొంత అసంతృప్తి చెలరేగడం, కొందరు సీనియర్ నేతలు హైకమాండ్‌కు ఫిర్యాదు చేయడం వంటి పరిణామాల నేపథ్యంలో ఎన్నికలకు ముందే ఆయనను ఆ పదవి నుంచి తప్పించి కిషన్ రెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత పార్టీలో నాయకత్వ మార్పులు జరుగుతూ వచ్చాయి. ప్రస్తుత రాజకీయ సమీకరణాల దృష్ట్యా, రాష్ట్రంలో పార్టీ మళ్లీ పూర్వవైభవం సంతరించుకోవాలన్నా, కేడర్‌లో ఉత్సాహం రావాలన్నా బండి సంజయ్ లాంటి దూకుడుగల నాయకుడే కచ్చితంగా అవసరమని జాతీయ నాయకత్వం భావిస్తున్నట్లు సమాచారం. పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న సునీల్ బన్సాల్ తదితర పరిశీలకులు కూడా ఇదే అభిప్రాయంతో ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల అమిత్ షా హైదరాబాద్ పర్యటన సందర్భంగా తెలంగాణలో పార్టీ భవిష్యత్తు కార్యాచరణ, అధ్యక్ష మార్పుపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలుస్తోంది. రామచంద్రరావుకు ఎమ్మెల్సీ బాధ్యతలు అప్పగిస్తే, ఖాళీ అయ్యే రాష్ట్ర అధ్యక్ష పీఠాన్ని మళ్లీ బండి సంజయ్‌కే కట్టబెట్టాలనే ప్రతిపాదనపై అధిష్టానం సానుకూలంగా ఉన్నట్లు పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. ఒకవేళ బండి సంజయ్‌కు మళ్లీ రాష్ట్ర పగ్గాలు దక్కితే తెలంగాణ రాజకీయాల్లో సమీకరణాలు వేగంగా మారే అవకాశం ఉంది. క్షేత్రస్థాయి కార్యకర్తలతో నేరుగా కనెక్ట్ అయ్యే నాయకుడిగా పేరున్న సంజయ్ రాకతో పార్టీ కేడర్‌లో మళ్ళీ కొత్త జోష్ వస్తుంది. అధికార కాంగ్రెస్ పార్టీ విధివిధానాలపై, వైఫల్యాలపై పోరాటాలు మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది. బీసీ వర్గానికి చెందిన బండి సంజయ్‌కు పగ్గాలు ఇవ్వడం ద్వారా పార్టీ సామాజిక వర్గాల సమీకరణలోనూ బలపడే అవకాశం ఉందనే అంచనాలున్నాయి. మొత్తానికి రాబోయే స్థానిక సంస్థలు, ఇతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని బీజేపీ హైకమాండ్ తీసుకునే ఈ నిర్ణయం రాష్ట్ర రాజకీయాల్లో కీలక పరిణామాలకు దారితీసే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది

టీపీసీసీ కంట్రోల్ చేయలేకపోతున్నారే..?

హైదరాబాద్ : తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో తీవ్ర అంతర్గత కలహాలు, క్రమశిక్షణా రాహిత్యం పరాకాష్టకు చేరాయి. ప్రభుత్వం ఏర్పాటై మూడేళ్లు గడుస్తున్నా, పార్టీ యంత్రాంగాన్ని ఏకతాటిపై నడిపించడంలో పిసిసి పూర్తిగా విఫలమవుతోంది. పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఎవరికి వారే యజమానులుగా వ్యవహరిస్తూ, బహిరంగంగా ఒకరిపై ఒకరు విమర్శలు గుప్పించుకుంటున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. కాంగ్రెస్ అంటేనే ప్రజాస్వామ్యం.. ఇక్కడ స్వేచ్ఛ ఎక్కువ అంటూ ప్రతి సందర్భంలోనూ సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నప్పటికీ, అసలు కాంగ్రెస్‌లో క్రమశిక్షణ అనే పదానికి అర్థమే లేకుండా పోతోందని సొంత పార్టీ శ్రేణులే తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. పార్టీలో ఒకరి తర్వాత ఒకరు క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడుతున్నా వారిని సరైన దారిలో పెట్టలేకపోవడానికి పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ చేతకానితనమే ప్రధాన కారణమని గాంధీ భవన్ వర్గాల్లో గట్టిగా వినిపిస్తోంది. స్వతహాగా బలమైన ప్రజాదరణ లేని నాయకుడిగా ముద్రపడిన మహేష్ గౌడ్, కనీసం తనకు దక్కిన పిసిసి అధ్యక్ష పదవి ద్వారా వచ్చే పవర్స్‌ను కూడా ఉపయోగించలేకపోతున్నారు. సీనియర్ నేతలు నిబంధనలు ఉల్లంఘిస్తున్నా, పబ్లిక్ వేదికలపై పార్టీ ప్రతిష్టను దిగజారుస్తున్నా కేవలం నోటీసులతో కాలయాపన చేయడం తప్ప, కఠినమైన చర్యలు తీసుకునే నైతిక ధైర్యం ఆయనలో కనిపించడం లేదు.పిసిసి చీఫ్ కనబరుస్తున్న ఈ బలహీనమైన వైఖరిపై పార్టీలోని ఒక బలమైన వర్గం తీవ్ర ఆగ్రహంతో రగిలిపోతోంది. డిసిసి అధ్యక్షుల ఎంపిక నుంచి ప్రభుత్వం–పార్టీ సమన్వయం వరకు ప్రతి విషయంలోనూ మహేష్ గౌడ్ దిగువ స్థాయి ఒత్తిళ్లకు లొంగిపోతున్నారని, అధిష్టానంతో ఉన్న సాన్నిహిత్యాన్ని కూడా పార్టీ ప్రయోజనాల కోనం ఉపయోగించలేకపోతున్నారని విమర్శిస్తున్నారు. ఒకవైపు బిఆర్ఎస్, బిజెపిలు క్షేత్రస్థాయిలో దూకుడు పెంచుతుంటే, పీసీసీ అధ్యక్షుడు మాత్రం పార్టీలోని వ్యతిరేకత స్వరాలను అదుపు చేయలేక చేతులెత్తేయడం ప్రభుత్వ ఇమేజ్‌పై కూడా తీవ్ర ప్రభావం చూపుతోంది.సొంత నియోజకవర్గాల్లో నేతల ఆధిపత్య పోరు, మంత్రివర్గ సభ్యులు–ఎమ్మెల్యేల మధ్య ఘర్షణలు నిత్యకృత్యంగా మారినా పీసీసీ స్పందించకపోవడం రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పెద్ద దెబ్బగా మారే ప్రమాదముంది. క్రమశిక్షణ విధింపులో జవాబుదారీతనం లేకపోతే ప్రజాస్వామ్యం అనే ముసుగులో పార్టీ కట్టుబాట్లు పూర్తిగా కూలిపోతాయని సీనియర్లు హెచ్చరిస్తున్నారు. ఇకనైనా పీసీసీ చీఫ్ తన శైలిని మార్చుకుని ఉక్కుపాదం మోపకపోతే, తెలంగాణ కాంగ్రెస్‌లో ఈ ఆధిపత్య పోరు కాస్తా నియంత్రించలేని దావానలంగా మారుతుందన్న అసంతృప్తి కనిపిస్తోంది.

శరవేగంగా కుంభమేళ పనులు

భోపాల్: దేశంలో ప్రయాగ్‌రాజ్, హరిద్వార్, ఉజ్జయిని వంటి ప్రాంతాల్లో కుంభమేళా జరుగుతుండగా.. నాసిక్ కుంభమేళాకు ప్రత్యేకత ఉంది. ఇది నాసిక్‌తో పాటు త్రయంబకేశ్వర్‌లోనూ నిర్వహిస్తారు. 1838లో త్రయంబకేశ్వర్‌లో శైవ, వైష్ణవ సాధువుల మధ్య స్నానాల ప్రాధాన్యత విషయంలో ఘర్షణలు జరగడంతో అఖాడాలను వేర్వేరు ప్రాంతాలకు తరలించారు. అప్పటి నుంచి శైవ సాధువులు త్రయంబకేశ్వర్‌లోని కుశావర్త తీర్థం వద్ద.. వైష్ణవ అఖాడాలు నాసిక్‌లోని రామ్‌కుండ్, తపోవన్ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహించే సంప్రదాయం కొన సాగుతోంది.వచ్చే ఏడాది 3 ప్రధాన అమృత స్నానాలు జరగనున్నాయి. 2027 ఆగస్ట్ 2, ఆగస్ట్ 31, సెప్టెంబర్ 11వ తేదీల్లో జరగనున్నాయి. వీటితో పాటు నాసిక్‌లో 45, త్రయంబకేశ్వర్‌లో 29 శుభస్నాన తేదీల్లో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 2027 కుంభమేళా కోసం చేపట్టిన అభివృద్ధి పనులు కేవలం తాత్కాలిక ఏర్పాట్లకే పరిమితం కావడం లేదు. మొత్తం 350కిపైగా ప్రాజెక్టులు చేపట్టగా.. వాటిలో దాదాపు 85 శాతం శాశ్వత మౌలిక సదుపాయాలు గా నిర్మిస్తున్నారు. కుంభమేళా ముగిసిన తర్వాత కూడా నాసిక్, త్రయంబకేశ్వర్ ప్రాంతాల ప్రజలకు ఇవి ఉపయోగపడేలా ప్రణాళికలు రూపొందించారు. కుంభమేళాతో పోలిస్తే ఈసారి మౌలిక సదుపాయాల కోసం పెట్టే వ్యయం దాదాపు 10 రెట్లు అధికమని కుంభమేళా మంత్రి గిరీశ్ మహాజన్ తెలిపారు. 2027 వేడుకలను పరిశుభ్రంగా, సురక్షితంగా, సమర్థంగా నిర్వహించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గత కుంభమేళా ఎలాంటి ప్రాణనష్టం లేకుండా ప్రశాంతంగా ముగిసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని ఈసారి మరింత మెరుగైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.భక్తుల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా రవాణా వ్యవస్థను విస్తరించడంపై ప్రభుత్వం ప్రధానంగా దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా దాదాపు 150 కిలోమీటర్ల మేర రహదారులను విస్తరించి, ఆధునికీకరిస్తున్నారు. గోదావరి, దాని ఉపనదులపై కొత్తగా 8 వంతెనలు నిర్మించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. కుంభమేళా సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రాకపోకలను సులభతరం చేయడం వీటి ప్రధాన ఉద్దేశం. ఇక నాసిక్ నగర ట్రాఫిక్ సమస్యకు దీర్ఘకాలిక పరిష్కారం చూపేలా 65.6 కిలోమీటర్ల ఔటర్ రింగ్ రోడ్డును నిర్మించనున్నారు. ఈ ప్రాజెక్టుకు సుమారు రూ.7,613 కోట్ల వ్యయం అంచనా వేశారు. రింగ్ రోడ్డు పూర్తి అయితే నగరంలోకి వచ్చే వాహనాల రద్దీ తగ్గడంతో పాటు, ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని భావిస్తున్నారు.కుంభమేళాలో పవిత్ర స్నానాలకు అత్యంత ప్రాధాన్యత ఉంటుంది. ఈ నేపథ్యంలో నాసిక్‌లో గోదావరి నది వెంట సుమారు 3.4 కిలోమీటర్ల పొడవున కొత్త ఘాట్లను నిర్మిస్తున్నారు. త్రయంబకేశ్వర్‌లోనూ అదనపు స్నాన ఘాట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నారు. చారిత్రక ఆలయాలు, కుండాలను పునరుద్ధరిస్తున్నారు. త్రయంబకేశ్వర్ ఆలయ పట్టణాన్ని అంతర్జాతీయ స్థాయి ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో 'శివ దర్శన్ పథ్' ప్రాజెక్టును చేపట్టారు. దీనివల్ల ఆలయానికి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు, ఆప్రాంత పర్యాటక ప్రాధాన్యత కూడా పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.కోట్లాది మంది భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించే గోదావరి నది పరిశుభ్రత ఈ కుంభమేళాలో అత్యంత కీలకమైన అంశం. నదిలోకి శుద్ధి చేయని మురుగునీరు చేరకుండా అడ్డుకునేందుకు నాసిక్‌లో భారీ మురుగునీటి నిర్వహణ ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో భాగంగా 4 అధునిక మురుగునీటి శుద్ధి కేంద్రాలు, దాదాపు 200 కిలోమీటర్ల పొడవున మురుగునీటి పైప్‌లైన్లు నిర్మిస్తున్నారు. ఈ పనుల్లో సగానికిపైగా ఇప్పటికే పూర్తి అయ్యాయని నాసిక్ మున్సిపల్ కమిషనర్ మనీషా ఖాత్రీ తెలిపారు. కుంభమేళా ప్రారంభానికి ముందే మిగిలిన పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈ ప్రాజెక్టులు పూర్తయితే నాసిక్ నగరంలో మురుగునీటి నిర్వహణ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు గోదావరి కాలుష్యాన్ని నియంత్రించేందుకు దోహదపడతాయి.



మహారాష్ట్రలో ఈ ఏడాది బలహీనమైన రుతుపవనాల కారణంగా పలు ప్రాంతాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో లక్షలాది, కోట్లాది మంది భక్తులకు అవసరమైన నీటిని అందించడం, స్థానిక ప్రజల అవసరాలను కూడా సమతుల్యం చేయడం అధికారులకు సవాలుగా మారనుంది. ముఖ్యంగా పుణ్యస్నానాల కోసం గోదావరిలో తగినంత నీటి లభ్యత ఉండేలా ముందస్తు ప్రణాళికలు అవసరం. భక్తుల అవసరాలు, నగరాల రోజువారీ నీటి అవసరాల మధ్య సమన్వయం సాధిస్తామని అధికారులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.ప్రస్తుతం నిర్మిస్తున్న మౌలిక సదుపాయాలు కుంభమేళా ముగిసిన తర్వాత కూడా కనీసం 30 ఏళ్లపాటు ఈ ప్రాంతానికి ఉపయోగపడతాయని నాసిక్–త్రయంబకేశ్వర్ కుంభమేళా అథారిటీ కమిషనర్ శేఖర్ సింగ్ వెల్లడించారు. రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు పర్యాటకం అభివృద్ధి చెందుతుందని, నాసిక్ అంతర్జాతీయ పర్యాటక గమ్యస్థానంగా ఎదిగేందుకు ఈ ప్రాజెక్టులు తోడ్పడతాయని ఆయన పేర్కొన్నారు. మొత్తంగా 2027 సింహస్థ కుంభమేళా ఆధ్యాత్మిక వేడుకగానే కాకుండా.. ఉత్తర మహారాష్ట్రలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కీలక మలుపుగా నిలవనుంది.

టార్గెట్ 100 గిగావాట్ పవర్..

న్యూఢిల్లీ: వికసిత్ భారత్ లక్ష్యంగా అడుగులు పడుతున్నాయి. 2047 బ్లూ ప్రింట్ రెడీ చేసిన కేంద్రం.. దానికి తగ్గట్లుగా చర్యలు చేపడుతోంది. అభివృద్ధికి విద్యుత్ ముఖ్యం.. అది కూడా భారీగా కావాలి. అందుకు తగినట్లుగా అణువిద్యుత్ పై కేంద్రం ఫోకస్ పెట్టింది. 2047 నాటికి దేశంలో 100 గిగావాట్ల అణు విద్యుత్ సామర్థ్యాన్ని సాధించడమే లక్ష్యంగా ప్రైవేట్ రంగానికి ద్వారాలు తెరిచినట్లు అణుశక్తి కమిషన్ చైర్మన్ అజిత్ కుమార్ మొహంతి వెల్లడించారు. ఇందులో భాగంగా ప్రైవేట్ కంపెనీలు 7.5 లక్షల కోట్ల మేర పెట్టుబడులు పెట్టి, 30 గిగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తాయని పేర్కొన్నారు.ప్రస్తుతం భారత్‌లో 9 గిగావాట్ల స్థాపిత సామర్థ్యం ఉండగా, ప్రభుత్వ సంస్థ ఔఖఅఒ 24 రియాక్టర్లను నడుపుతోంది. మరో 17 రియాక్టర్ల నిర్మాణం జరుగుతోంది. అణురంగాన్ని వేగవంతం చేసేందుకు తెచ్చిన శాంతి చట్టంతో ప్రైవేట్ కంపెనీల ప్రవేశానికి మార్గం సుగమమైందని ఐదేళ్లలో ప్రైవేట్ సంస్థలూ రియాక్టర్లను నిర్వహిస్తాయని ఇఅఆ తెలిపింది. ఒక మెగావాట్ అణు విద్యుత్ ఉత్పత్తికి 25 కోట్లు ఖర్చవుతుందని, ఉక్కు, సిమెంట్, భారీ పరిశ్రమల అవసరాలకు స్మాల్ మాడ్యులర్ రియాక్టర్ల తయారీని ప్రభుత్వం పరిశీలిస్తోంది."ప్రభుత్వ రంగ సంస్థ అయిన 'న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్' ప్రస్తుతం 24 రియాక్టర్లను నిర్వహిస్తోంది. ప్రైవేట్ సంస్థలు కూడా అణు విద్యుత్ రంగంలోకి రావాలని భావిస్తున్నాం. అందుకే కొత్తగా శాంతి చట్టాన్ని తీసుకువచ్చాం. రాబోయే ఐదేళ్లలో ఒకటి రెండు ప్రైవేట్ రంగ సంస్థలు రియాక్టర్లను నిర్వహిస్తాయని ఆశిస్తున్నాను. 2047 నాటికి వారి నుంచి సుమారు 30 ఉచి విద్యుత్ ఉత్పత్తి అవుతుందని మేము అంచనా వేస్తున్నాం. 1 ఓచి విద్యుత్ ఉత్పత్తికి సుమారు రూ. 25 కోట్ల ఖర్చు అవుతుంది" అని మొహంతి పేర్కొన్నారు.దేశీయ వనరైన థోరియంను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా భారత్ మూడంచెల అణు కార్యక్రమాన్ని వేగవంతం చేస్తోంది. మొదటి దశలో యురేనియం ఇంధనంగా వాడే రియాక్టర్లను ఉపయోగిస్తారు. ఇవి పనిచేస్తున్నప్పుడు విద్యుత్‌ను ఉత్పత్తి చేయడంతో పాటు, ప్లూటోనియం–239ను కూడా ఉత్పత్తి చేయగలవు. వాడిన అణు ఇంధనాన్ని పునఃప్రక్రియ చేయడం ద్వారా దీనిని తిరిగి పొందవచ్చని మొహంతి అన్నారు. ఇలా తిరిగి పొందిన ప్లూటోనియంను ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ టెక్నాలజీ ఆధారంగా రెండో దశలో ఉపయోగిస్తారు. ఈ దశ అదనపు విచ్ఛిన్న పదార్థాల ఉత్పత్తికి మద్దతు ఇవ్వడానికి, చివరికి థోరియం వినియోగాన్ని సులభతరం చేయడానికి రూపొందించిందని అన్నారు. "మూడో దశలో థోరియంను అణు ఇంధనంగా ఉపయోగపడే విచ్ఛిన్న పదార్థంగా మార్చాలని భావిస్తున్నారు. థోరియంను ముందుగా తగిన విచ్ఛిన్న పదార్థంగా మార్చకుండా నేరుగా సంప్రదాయ రియాక్టర్ ఇంధనంగా ఉపయోగించలేరు. ఈ సాంకేతిక సవాలును అధిగమించి, దేశీయ వనరులను మరింతగా ఉపయోగించుకునే అణు ఇంధన చక్రానికి అంతిమంగా మద్దతు ఇవ్వడానికే భారత్ మూడు– దశల కార్యక్రమాన్ని రూపొందించింది." అని మొహంతి అన్నారు.మోనజైట్ కలిగిన సముద్రతీర ఇసుకతో ముడిపడిన థోరియం వనరులు భారతదేశంలో గణనీయంగా ఉన్నాయి. ''ఒడిశా, ఆంధ్రప్రదేశ్‌తో సహా తీర రాష్ట్రాల్లో సముద్రతీర ఇసుక ఖనిజ నిక్షేపాలు ఉన్నాయి. వాటి నుంచి మోనజైట్‌ను వెలికితీయవచ్చు. వాటి నుంచి సరైన ప్రక్రియ ద్వారా థోరియంను తిరిగి పొందవచ్చు. ప్రపంచ థోరియం నిల్వల్లో 25 శాతం భారతదేశంలోనే ఉన్నాయి." అని ఆయన తెలిపారు. ఈ క్రమంలో తమిళనాడులోని కల్పక్కంలో స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించిన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్ విజయవంతంగా క్రిటికాలిటీని సాధించింది. ఇది అందుబాటులోకి వస్తే రష్యా తర్వాత వాణిజ్య ప్రాతిపదికన ఫాస్ట్ బ్రీడర్ రియాక్టర్‌ను నిర్వహిస్తున్న రెండో దేశంగా భారత్ చరిత్ర సృష్టించనుంది.

కూకట్‌పల్లి 286 ఎకరాల భూ వివాదం

హైదరాబాద్: కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లోని 286 ఎకరాల భూమిపై దశాబ్దాలుగా కొనసాగుతున్న వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. 1961లో మధ్యతరగతి ఉద్యోగులు ఏర్పాటు చేసిన భాగ్యనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ ఈ భూమిలో ప్లాట్ల కోసం ఒప్పందాలు చేసుకుంది. అనంతరం కోర్టు ప్రక్రియ ద్వారా 167 ఎకరాలకు రిజిస్ట్రేషన్లు జరిగాయి. మిగిలిన 119 ఎకరాలపై వివాదం కొనసాగుతోంది. భూములపై హక్కుల విషయంలో పలు పక్షాలు వాదనలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం తమ స్థలాల్లో జోక్యం, ప్రహరీ నిర్మాణాలు, ఒత్తిళ్లపై సొసైటీ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తూ న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు.భాగ్యనగర్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ 1961లో చిరుద్యోగులు, మధ్యతర గతి కుటుంబాలు కలిసి ఏర్పాటు చేసుకున్నారు. రాజధాని నగరంలో తమ కుటుంబాలకు సొంత స్థలాలు ఉండాలనే ఉద్దేశంతో సొసైటీని ఏర్పాటు చేసినట్లు సభ్యులు చెబుతున్నారు. అనంతరం కూకట్‌పల్లి సర్వే నంబర్ 1007లోని 286 ఎకరాల భూమిని కొనుగోలు చేసేందుకు అప్పటి హక్కుదారు నవాబ్ రియాజ్ యార్ జంగ్ వారసులతో ఒప్పందాలు చేసుకున్నట్లు సమాచారం.అయితే భూమి రిజిస్ట్రేషన్ ప్రక్రియలో జాప్యం చోటుచేసుకుంది. చివరకు 1991 నుంచి 1998 మధ్య కోర్టు ప్రక్రియ ద్వారా 70 ఎకరాలు, 50 ఎకరాలు, 25 ఎకరాలు, 22 ఎకరాల చొప్పున మొత్తం 167 ఎకరాలు సొసైటీకి రిజిస్టర్ అయినట్లు సభ్యులు చెబుతున్నారు. మిగిలిన 119 ఎకరాలకు రిజిస్ట్రేషన్ జరగలేదు. ఈ భూముల్లో కొంత భాగంలో సొసైటీ సభ్యులు ఇప్పటికే ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్నారు. మరికొంత భూమి ఖాళీగా ఉంది.మాదాపూర్‌లో హైటెక్ సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతంలో భూముల ధరలు భారీగా పెరిగాయి. హైటెక్ సిటీకి సమీపంలో ఉన్న కూకట్‌పల్లి ప్రాంతంలో భూములకు డిమాండ్ పెరగడంతో సొసైటీ భూములపై కూడా వివాదం ముదిరిందని సభ్యులు ఆరోపిస్తున్నారు. ప్రత్యామ్నాయ డాక్యుమెంట్లు సృష్టించి భూములపై హక్కులు పొందేందుకు ప్రయత్నాలు జరిగాయని వారు చెబుతున్నారు. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి తుది నిర్ధారణ న్యాయస్థానాల తీర్పులు, అధికారిక రికార్డుల ఆధారంగానే జరగాల్సి ఉంది.సొసైటీ సభ్యుల ఆరోపణల ప్రకారం, పాత భూలావాదేవీలకు సంబంధించి కొన్ని ప్రత్యామ్నాయ పత్రాలు తెరపైకి వచ్చాయి. జంగ్ కుటుంబానికి సంబంధించిన వ్యక్తుల పేర్లు, పాత ఒప్పందాలు, ఇతర సంస్థలకు భూముల బదలాయింపునకు సంబంధించిన పత్రాలను చూపిస్తూ హక్కులు వాదిస్తున్నారని వారు పేర్కొంటున్నారు. అయితే సొసైటీ సభ్యులు ఈ పత్రాల చెల్లుబాటుపై అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో సంబంధిత పేర్లకు ఆధారాలు లేవని కూడా వారు చెబుతున్నారు.రాష్ట్ర విభజన అనంతరం ఈ వివాదం మరింత సంక్లిష్టంగా మారిందని సొసైటీ సభ్యులు పేర్కొంటున్నారు. తమకు సంబంధించిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణానికి అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యాయని, అధికారులను ఆశ్రయించినా సమస్య పరిష్కారం కాలేదని వారు ఆరోపిస్తున్నారు. మరోవైపు భూముల హక్కులపై వివిధ పక్షాలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో వివాదం కోర్టుల్లో కొనసాగుతోంది.ప్రస్తుతం 286 ఎకరాల భూమి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని సొసైటీ సభ్యులు చెబుతున్నారు. దీనివల్ల దశాబ్దాల క్రితం స్థలాలు కొనుగోలు చేసిన కుటుంబాల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఇళ్లలో నివసిస్తున్నవారితో పాటు ఖాళీ స్థలాలు కలిగి ఉన్నవారూ తమ ఆస్తుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు వృద్ధులు కావడం, మరికొందరు మరణించడంతో వారి వారసులు న్యాయపోరాటం కొనసాగించాల్సి వస్తోందని సభ్యులు అంటున్నారు.ఈ భూముల విలువ ప్రస్తుతం ఎకరాకు వందల కోట్ల రూపాయల స్థాయిలో మె?త్తంగా 50 వేల కోట్ల వరకు ఉందని సొసైటీ సభ్యులు చెబుతున్నారు. అందువల్ల 286 ఎకరాల ఆస్తి విలువ భారీగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇదే కారణంగా భూములపై హక్కుల వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు కొందరు సభ్యులతో మధ్యవర్తిత్వం ద్వారా రాజీ ప్రయత్నాలు జరుగుతున్నాయని సొసైటీ వర్గాలు చెబుతున్నాయి.



కాఫీ షాపీల్లోనూ ఆఫీసు వర్క్...

బెంగళూరు: కాఫీ షాపులను కొందరు తాత్కాలిక ఆఫీసులుగా మార్చుకుంటున్నారు. కస్టమర్లకు ఇది సౌకర్యంగా ఉన్నా కేఫే యజమానులకు తలనొప్పిగా మారుతోంది. బెంగళూరులో ఓ కేఫే యజమాని ఎదుర్కొంటున్న సమస్య ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కేవలం రూ.150 కాఫీ ఆర్డర్ చేసి, గంటల తరబడి టేబుళ్లను ఆక్రమించుకుంటున్న కస్టమర్ల వల్ల వ్యాపారం దెబ్బతింటోందని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారుబెంగళూరులోని ఇందిరానగర్‌లో ఓ వ్యక్తి రూ 60 నుంచి 70 లక్షలు పెట్టుబడి పెట్టి కెఫె ప్రారంభించారు. వ్యాపారం ప్రారంభించిన కొద్ది రోజులకే ఓ సమస్య ఎదురైంది. అక్కడికి వచ్చే కస్టమర్లు కేవలం రూ.150 విలువైన ఒక కప్పు కాఫీ మాత్రమే ఆర్డర్ చేస్తున్నారు. ఆ తర్వాత ల్యాప్‌టాప్‌లు తెరిచి గంటల తరబడి అక్కడే కూర్చుంటున్నారు. కొన్నిసార్లు రోజంతా కూడా టేబుళ్లను ఆక్రమించుకుంటున్నారు.కేఫ్‌లోని టేబుళ్లన్నీ ఇలా గంటల తరబడి కస్టమర్లతో నిండిపోవడంతో కొత్తగా వచ్చే వారికి కూర్చోవడానికి స్థలం ఉండటం లేదు. దీంతో చాలా మంది కెఫెలోకి వచ్చి సీట్లు ఖాళీగా లేకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోతున్నారు. ఒకవైపు కాఫీ ఆర్డర్ చేసిన కస్టమర్లను వెళ్లిపోవాలని చెప్పలేరు. అలా చెబితే వారు గూగుల్‌లో నెగెటివ్ రివ్యూ ఇచ్చే అవకాశం ఉంది. దానివల్ల కెఫెకు నష్టం కలుగుతుందని యజమాని ఆందోళన చెందుతున్నారు.ప్రముఖ కాఫీ చైన్లు స్టార్‌బక్స్, అఅఆ, థర్డ్ వేవ్ లో కాఫీ, స్నాక్స్ ధరలు ఎక్కువగా ఉంటాయి. కస్టమర్లు కేవలం కాఫీ, స్నాక్స్ కోసమే డబ్బులు చెల్లించడం లేదు అక్కడ కూర్చుని గంటల తరబడి గడిపే సమయానికి పరోక్షంగా చెల్లిస్తున్నారు. కెఫెలో కూర్చునే స్థలానికీ ఓ ధర ఉంటుంది.ఈ పోస్టు వైరల్ కావడంతో నెటిజన్లు రకరకాల సూచనలు చేస్తున్నారు. కెఫెలో ఎంతసేపు ఉంటే అన్ని గంటలకు కనీసం ఒక కాఫీ ఆర్డర్ చేయాలనే నిబంధన పెట్టాలని ఓ నెటిజన్ సూచించారు. కాఫీ అమ్మడం కంటే కెఫెలో గడిపే సమయానికి డబ్బులు వసూలు చేసే విధానాన్ని తీసుకురావాలి. ఎక్కువ ధర చెల్లిస్తే మెరుగైన సీటింగ్, కాఫీ, స్నాక్స్ అందించవచ్చు అని మరికొందరు అన్నారు. కొన్ని కేఫెలలో ల్యాప్‌టాప్‌ల వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. కస్టమర్లు చేసే ఖర్చును బట్టి కెఫెలో ఉండే సమయాన్ని నిర్ణయించాలి. రూ.150 నుంచి రూ.750 వరకు బిల్లు ఉంటే గరిష్ఠంగా గంటన్నర, రూ.750 నుంచి రూ 1,500 వరకు బిల్లు ఉంటే రెండు గంటల సమయం ఇవ్వొచ్చు. వారంలో ఉదయం వేళల్లో ల్యాప్‌టాప్‌లతో పని చేసేందుకు అనుమతించి, సాయంత్రాలు, వారాంతాల్లో మాత్రం ఆంక్షలు విధించాలని మరో నెటిజన్ సూచించారు. మొత్తానికి కేఫెలలో కూర్చుని పని చేసేవారి సౌకర్యం ఒకవైపు వ్యాపార నిర్వహణ మరోవైప

రోజూ గ్యాప్ లేకుండా ఇది తాగితే..



ఒంట్లో నీరసం పోయి దృఢంగా మారతారు

నీరసం, అలసటతో ఇబ్బంది పడేవాళ్లు రోజూ గ్యాప్ లేకుండా ఇది తాగితే చాలు దెబ్బకు ఒంట్లో నీరసం పోయి రాత్రికి రాత్రే బలంగా మారతారు. మరి అస్సలు లేట్ చేయకుండా ఇది ఏంటి? దీనిని ఎలా చేసుకోవాలి? రాగి పిండి డ్రింక్ రెసిపీ కావాల్సిన పదార్థాలు : రెండు టేబుల్ స్పూన్స్ రాగి పిండి, ఒక కప్పు నీరు,ఒక కప్పు పాలు , రెండు టేబుల్ స్పూనన్స్ బెల్లం పొడి, రుచికి సరిపడా ఉప్పు, అర టేబుల్ స్పూన్ యాలకుల పొడి, అర టేబుల్ స్పూన్ నెయ్యి, ఇంకా 10 జీడిపప్పు, 10 బాదం పప్పులు తీసుకోవాలి. రాగి పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం : మీరు ముందుగా ఒక గినెలో కొద్దిగా రాగి పిండిని తీసుకుని దానిలో నీరు వేసి ఉండలు లేకుండా కలపాలి. ఇక ఇప్పుడు మళ్ళీ ఇంకో పాత్ర తీసుకుని దానిలో నీరు కొద్దిగా పోసి మరిగించాలి. ఈ నీరు బాగా మరిగిన తర్వాత రాగి పిండిని కొంచం కొంచం పోస్తూ దీనిని కలుపుకోవాలి. రాగి పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 1 : ఇక ఇప్పుడు దీనిని మంటపై 10 నిముషాల పాటు ఉంచి ఈ పిండి బాగా ఉడికేలా చేయాలి.

ఇక ఇప్పుడు దీనిలో పాలు కొంచం వేసి అలాగే 3 నిమిషాల పాటు దీనిని బాగా మరిగించాలి. ఇంకా స్టొ ఆఫ్ చేసి దీనిలో బెల్లం పొడి కూడా వేసి పూర్తిగా కరిగే వరకు పొయ్యి మీదే ఉంచాలి. రాగి పిండి డ్రింక్ రెసిపీ తయారీ విధానం స్టెప్ 2 : ఇక చివర్లో దీనిలో కొద్దిగా యాలకుల పొడి, నెయ్యి కూడా వేసి మంచిగా కలపాలి.

వర్షాకాలంలో ఐ డ్రాప్స్ వాడుతున్నారా?



వర్షాకాలంలో వాతావరణంలో తేమ శాతం పెరగడం వల్ల గాలిలో బ్యాక్టీరియా, వైరస్‌లు విపరీతంగా వృద్ధి చెందుతాయి. ఈ కాలంలో కళ్ల కలకలు, కళ్ల మంటలు, దురద మరియు ఎరుపుదనంతో కూడిన ఇన్ఫెక్షన్లు చాలా సర్వసాధారణంగా వ్యాపిస్తుంటాయి. అయితే, కంట్లో చిన్నపాటి ఎరుపుదనం లేదా నలత కనిపించగానే చాలామంది ఆసుపత్రికి వెళ్లకుండా, నేరుగా మెడికల్ షాప్‌కు వెళ్లి కౌంటర్లో దొరికే ఐ డ్రాప్స్ కొనుగోలు చేసి వాడుతుంటారు. ఇలా ఓవర్ ది కౌంటర్ ఐ డ్రాప్స్ వాడే అలవాటు అత్యంత ప్రమాదకరమని, వైద్యుల సలహా లేకుండా డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేని చుక్కల మందు వాడటం వల్ల శాశ్వతంగా దృష్టి కోల్పోయే ప్రమాదం ఉందని నేత్ర వైద్య నిపుణులు తీవ్రంగా హెచ్చరిస్తున్నారు. 1. ఇన్ఫెక్షన్ రకం తెలియకపోవడం కంటి ఇన్ఫెక్షన్లు వైరస్, బ్యాక్టీరియా, ఫంగస్ లేదా అలర్జీ వల్ల రావచ్చు. బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు 'యాంటీబాక్టీరియల్' డ్రాప్స్ వాడాలి. వైరల్ ఇన్ఫెక్షన్లకు వేరే రకం డ్రాప్స్ అవసరం. వైరల్ ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు పొరపాటున యాంటీబాక్టీరియల్ లేదా అలర్జీ డ్రాప్స్ వాడితే ఇన్ఫెక్షన్ తగ్గకపోగా మరింత తీవ్ర రూపం దాలుస్తుంది. 2. స్టెరాయిడ్ ఐ డ్రాప్స్ వాడటంతో పెను ప్రమాదం మెడికల్ షాపుల్లో దొరికే కొన్ని సాధారణ ఐ డ్రాప్స్‌లో స్టెరాయిడ్స్ ఉంటాయి. స్టెరాయిడ్ డ్రాప్స్‌ను డాక్టర్ పర్యవేక్షణ లేకుండా వాడటం వల్ల:కంటి ఒత్తిడి పెరిగి గ్లాకోమా వచ్చే ప్రమాదం ఉంది. కంటిలో శుక్లాలు త్వరగా వచ్చే అవకాశం ఉంటుంది. కంటి రెటీనా లేదా కార్నియాపై పుండ్లు ఏర్పడి చూపు శాశ్వతంగా మందగించవచ్చు. 3. కంటి స్వయం రక్షణ శక్తి పడిపోవడం వైద్యుడి సలహా లేకుండా పదే పదే చుక్కల మందులు వాడటం వల్ల కంట్లోని సహజసిద్ధమైన కన్నీళ్ల వ్యవస్థ దెబ్బతింటుంది. అవసరం లేకుండానే లేదా సరైన మోతాదు లేకుండా యాంటీబయోటిక్ చుక్కల మందులు వాడటం వల్ల, ఆ క్రిములు సదరు మందులకు అలవాటుపడి పోతాయి. తర్వాతి కాలంలో తీవ్రమైన ఇన్ఫెక్షన్ వచ్చినప్పుడు ఎంత మంచి మందులు వాడినా పనిచేయవు. వర్షాకాలంలో కంటి ఆరోగ్య రక్షణకు నిపుణుల సలహాలు: డాక్టర్ ప్రిస్క్రిప్షన్ తప్పనిసరి: కంటి సమస్య ఏదైనా సరే నేత్ర వైద్యుడిని సంప్రదించి వారు సూచించిన చుక్కల మందులను మాత్రమే నిర్ణీత రోజులు ఉపయోగించాలి.

క్యాన్సర్‌కు చెక్ పెట్టే శక్తి ఈ మూలికల్లో ఉందా?

క్యాన్సర్, మధుమేహం, వాపు వంటి వ్యాధులకు సహజ పరిష్కారాల కోసం శాస్త్రవేత్తలు డాండెలైన్, గ్రావియోలా, వార్మ్‌వుడ్ వంటి మూలికలపై విస్తృతంగా పరిశోధనలు చేస్తున్నారు. అయితే ఇవి ఇంకా ప్రయోగశాల దశలోనే ఉండగా, వైద్యుల సలహా లేకుండా ఉపయోగించకూడదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. సాంప్రదాయ మూలికలలో అద్భుత ఔషధ గుణాలు ఉన్నట్లు తాజా అధ్యయనాలు వెల్లడిస్తున్నాయి. క్యాన్సర్, మధుమేహం, వాపు వంటి తీవ్రమైన అనారోగ్య సమస్యలకు పరిష్కారం కనుగొనేందుకు ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు వేగవంతం అయ్యాయి. ఇందులో భాగంగా ప్రాచీన కాలం నుంచి వాడుతున్న సాంప్రదాయ మూలికలు, మొక్కలపై శాస్త్రవేత్తలు దృష్టి సారించారు. పచ్చని ప్రకృతిలో దాగి ఉన్న సహజ సమ్మేళనాలతో భవిష్యత్తులో ప్రాణాంతక వ్యాధులకు అద్భుతమైన మందులు తయారు చేయొచ్చని వారు భావిస్తున్నారు. ఈ దిశగా జరుగుతున్న ప్రయోగాలు ఇప్పుడు వైద్య రంగంలో ఆసక్తి రేపుతున్నాయి. ముఖ్యంగా క్యాన్సర్, వాపు, జీవక్రియ రుగ్మతలకు చెక్ పెట్టేందుకు డాండెలైన్ వేర్లు, గ్రావియోలా ఆకులు, వార్మ్ వుడ్ వంటి మొక్కలను పరిశోధకులు క్షుణ్ణంగా పరీక్షిస్తున్నారు. వార్మ్ వుడ్ నుంచి తీసే ఆర్టెమిసినిన్ ఇప్పటికే మలేరియా చికిత్సలో కీలకంగా మారింది. డాండెలైన్ వేర్ల నుంచి తీసిన రసం క్యాన్సర్ కణాలను ఎలా అడ్డుకుంటుందో ప్రయోగశాలల్లో విశ్లేషిస్తున్నారు.అలాగే గ్రావియోలా ఆకులు సహజంగా క్యాన్సర్ కణాల ఎదుగుదలను అడ్డుకుంటాయన్న వాదనలపై లోతైన అధ్యయనాలు జరుగుతున్నాయి. ఇదే తరహాలో క్యాన్సర్ కణాలను అంతం చేసే శక్తి ఈ మూలికలకు ఉందా అనే కోణంలో అధ్యయనాలు సాగుతున్నాయి. వీటితో పాటు బ్లాక్ సీడ్, క్యాట్స్ క్లా అనే ప్రత్యేకమైన మొక్కలను శాస్త్రవేత్తలు పరీక్షిస్తున్నారు. యాంటీ ఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే చాగా పుట్టగొడుగులు, శరీరానికి అవసరమైన పోషకాలను అందించే సీ బక్థార్న్ మొక్కల ఔషధ గుణాలను వెలికితీసే ప్రయత్నం చేస్తున్నారు. ఈ మొక్కల్లోని సహజసిద్ధమైన రసాయనాలు శరీరంలోని రోగ నిరోధక వ్యవస్థను బలోపేతం చేస్తాయని అంచనా వేస్తున్నారు. అనారోగ్య కణాల పెరుగుదలను అడ్డుకునే శక్తి వీటికి ఉందని ప్రాథమికంగా గుర్తించారు. ఈ సమ్మేళనాలు శరీరంలో వాపులను తగ్గించడమే కాకుండా, మెటబాలిక్ సమస్యలకు చెక్ పెడతాయని భావిస్తున్నారు. అయితే, ఈ పరిశోధనలన్నీ ఇంకా ప్రయోగశాల దశలోనే ఉన్నాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. జంతువులపై, టెస్ట్ ట్యూబ్ లలో మాత్రమే ఈ ప్రయోగాలు జరుగుతున్నాయి. మనుషులపై వీటి ప్రభావం ఎలా ఉంటుంది, సైడ్ ఎఫెక్ట్స్ ఏమైనా ఉంటాయా అనేది ఇంకా నిర్ధారణ కాలేదు. కొన్ని మూలికలు నేరుగా వాడితే నరాల సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని కూడా హెచ్చరిస్తున్నారు.



రోజుకు ఐదారు సార్లు టీ లాగిస్తున్నారా?



మనదేశంలో చాలామందికి ఉదయం నిద్రలేవగానే వేడివేడి టీ తాగనిదే రోజు గడవదు. అలసటగా అనిపించినా, తలనొప్పి వచ్చినా లేదా ఫ్రెండ్స్‌తోముచ్చట్లు పెట్టినా సరే కప్పుటీ ఉండాల్సిందే. అయితే, పరిమితికి మించి రోజుకు పదే పదే టీలు తాగడం వల్ల శరీరానికి తీవ్రమైన నష్టం జరుగుతుందనేది నగ్న సత్యం. టీలో ఉండే కెఫిన్, టానిన్లు అధిక చక్కెర వల్ల అసిడిటీ, నిద్రలేమి మానసిక ఆందోళన వంటి అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయి. ఒకవేళ మీరు కేవలం 30 రోజుల పాటు క్రమం తప్పకుండా తాగే టీని పూర్తిగా పక్కన పెడితే, మీ శరీరంలో మరియు ఆరోగ్య స్థితిలో ఊహించని అద్భుతమైన మార్పులు వస్తాయని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. 1. ప్రశాంతమైన గాఢమైన నిద్ర టీలో ఉండే కెఫిన్ నరాల వ్యవస్థను నిరంతరం ఉత్తేజపరుస్తుంది. దీనివల్ల రాత్రి వేళల్లో సరిగ్గా నిద్రపట్టకపోవడం లేదా నిద్ర మధ్యలోనే మెలకువ రావడం జరుగుతుంది.

అందుకే ఆ ప్రాజెక్ట్స్ విషయంలో జాగ్రత్త పడ్డా



భిన్నమైన కథలను, విభిన్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఆయన, ఇప్పుడు నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా మారబోతూ తన మల్టీ టాలెంట్‌ను చూపిస్తున్నారు. 'గువ్వలచెరువు ఘాట్' సిరీస్‌తో ఓటీటీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడమే కాకుండా, 'రియాలిటీ' అనే సినిమాతో మెగాఫోన్ పట్టి దర్శకుడిగా మారనున్నారు. ఈ క్రమంలో తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కిరణ్ అబ్బవరం తనకెరీర్, రాబోయే చిత్రాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేటి సమాజంలో మధ్యతరగతి యువత ఎదుర్కొంటున్న పెళ్లి ఒత్తిళ్ల నేపథ్యంలోనే 'రియాలిటీ' సినిమా కథ సాగుతుందని కిరణ్ తెలిపారు. పెళ్లి చేసుకోవాలనుకునే ఓ కుర్రాడి జీవితంలో ఎదురయ్యే సరదా సంఘటనలను ఈ చిత్రంలో వినోదాత్మకంగా చూపించబోతున్నామని చెప్పారు. ఈ సినిమా కోసం నటనతో పాటు దర్శకత్వ, రచన బాధ్యతలను కూడా తానే స్వయంగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు. గత అనుభవాల గురించి మాట్లాడుతూ.. 2023లో విడుదలైన 'మీటర్' చిత్రాన్ని ప్రేక్షకులు తిరస్కరించడం తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని కిరణ్ అబ్బవరం ఓపెన్‌గా అంగీకరించారు. సినిమాల్లో కొత్తదనం లేకపోతే జనాలు ఆదరించరని తనకు అర్థమైందని, ప్రేక్షకులు ట్రోల్ చేసేలోపే మనల్ని మనం సరిదిద్దుకోవాలని అన్నారు. అందుకే ఇప్పుడు తన తదుపరి చిత్రాల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక తన లైనప్ గురించి చెబుతూ.. శ్రీకాంత్ పుష్పాల దర్శకత్వంలో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నానని, ఇది పీరియాడిక్ చిత్రం కాకపోయినా మైథాలజీ టచ్‌తో సాగే నేటితరం కథ అని చెప్పారు. ఇందులో కత్తులు తిప్పుతూ భారీ కాస్ట్యూమ్స్‌లో కనిపించనున్నట్లు తెలిపారు. అలాగే తాను నిర్మాతగా తెరకెక్కిస్తున్న 'హత' చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని, సినిమా ప్రారంభమైన 15 నిమిషాల తర్వాత ఆడియెన్స్‌ను సీటు అంచున కూర్చోబెట్టేలా ఈ థ్రిల్లర్ ఉంటుందని వివరించారు. ఇక తాను నటించిన 'గువ్వలచెరువు ఘాట్' వెబ్ సిరీస్‌లో ఒక జర్నలిస్ట్‌గా విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నట్లు తెలిపారు.

రవితేజ 'తులాభారం'



హీరో రవితేజ, దర్శకుడు వివేక్ ఆత్రేయ క్రేజీ కాంబోలో బ్రిడ్జ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై లక్ష్మణ్, శ్రీనిరావు నిర్మిస్తున్న సినిమా 'తులాభారం'. ఈ సినిమా టైటిల్ రివీల్‌ను మేకర్స్ వినూత్నంగా రూపొందించిన 'ది టైటిల్ డాక్యుమెంటరీ' వీడియోను విడుదల చేశారు.

వివేక్ ఆత్రేయ తనదైన స్టయిల్ లో రూపొందించిన ఈ వీడియోను మై హోమ్ రామ్ విడుదల చేశారు.

ఈ వీడియోలో సినిమాలోని కీలక పాత్రలను కూడా పరిచయం చేశారు. జడేజాగా అనిల్ కరెళ్ల, రాబిన్‌గా రవి ఆంటోనీ, సౌండ్‌గా అనస్వర రాజన్, దేవరాజ్‌గా తరుణ్ భాస్కర్, శివాజీ రావుగా జేడీ చక్రవర్తి, కృష్ణవేణిగా ప్రియాంక మోహన్ కనిపించనున్నారు.

మ్యాజిక్ చూసేందుకు ఆతృతగా ఎదురుచూస్తున్నా!



ఇటీవల 'పూజా మేరీ జాన్', 'డెకాయిట్' వంటి విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్.. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్, ఫిల్మ్‌మేకర్ గణేష్ ఆచార్య తన రియల్ లైఫ్ జర్నీ ఆధారంగా తెరకెక్కించిన బయోపిక్ డ్రామా 'గణేష్ డస్ట్ టు స్టార్‌డస్ట్' లో మృణాల్ భాగమయ్యారు. మాస్టర్‌జీ బయోపిక్‌లో భాగమవ్వడంపై మృణాల్ ఠాకూర్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'ఈ ట్రైలర్ కేవలం అందమైన విజువల్స్ మాత్రమే కాదు మాస్టర్‌జీ.. మీ కష్టానికి, ప్యాషన్‌కు అద్దం పట్టే రిఫ్లెక్షన్ ఇది. మీ ప్రయాణంలో రెండు పాటల ద్వారా నేను కూడా భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉంది.

యూట్యూబ్ చానల్ పెట్టింది వాళ్ల కోసమే...

ఒకవైపు వరుస సినిమాలతో అలరిస్తూనే, మరోవైపు బుల్లితెరపై పాపులర్ రియాలిటీ షో 'బిగ్‌బాస్' హోస్ట్‌గా ఎంతోకాలంగా మెప్పిస్తున్నారు బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్. కెరీర్ పరంగా ఎంత బిజీగా ఉన్నప్పటికీ, ఆయన ఇటీవల ఒక కీలకమైన నిర్ణయం తీసుకున్నారు. చిన్నారుల కోసం 'బీయింగ్ సల్మాన్ ఖాన్' పేరుతో ఓకొత్త యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించారు.

తాజాగా, ఈ చానల్ మొదలుపెట్టడానికి గల ప్రధాన ఉద్దేశాన్ని సల్మాన్‌ఖాన్ ఓపోస్ట్‌ద్వారా స్పష్టం చేశారు. తన యూట్యూబ్ ఛానల్ పెద్దల కోసం కాదని, కేవలం చిన్న పిల్లలను దృష్టిలో ఉంచుకునే డిజైన్ చేశామని ఆయన తెలిపారు. తన యూట్యూబ్ చానల్‌ను చూస్తున్న ప్రతి ఒ క్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. చానల్‌లోని కంటెంట్‌పెద్దవా రికి అంతగా నచ్చకపోవచ్చని, కానీ వినోదం, ప్రేమ, కుటుంబ బంధాలతో పాటు పిల్లలకు సరైన విద్య కూడా ఎంతో అవసరమని ఆయన పేర్కొన్నారు. అందుకే చిన్నారులకు అవసరమయ్యే, వారి మానసిక వికాసానికి ఉపయోగపడే కంటెంట్‌ను మాత్రమే ఇందులో పోస్ట్ చేయబోతున్నట్లు వివరించారు.

కాగా సల్మాన్ ఖాన్ యూట్యూబ్ ప్లాట్‌ఫారమ్‌పైకి రావడం ఇది మొదటిసా రేమీకాదు. గతంలో 2020లో కరోనా లాక్‌డౌన్ సమయంలో 'సల్మాన్ ఖాన్ ఫిల్మ్ మ్యూజిక్' పేరుతో ఓఛానల్‌ను ప్రారంభించి తన మ్యూజిక్ వీడియోలను అందులో రిలీజ్ చేశారు. ఇక ఇప్పుడు ప్రత్యేకంగా చిన్నారుల విద్య, వినోదాన్ని లక్ష్యంగా చేసుకుని రెండో ఛానల్‌ను తీసుకురావడం పట్ల సల్మాన్ అభిమానులు, నెటిజన్లు ప్రశంసలు కురిపిస్తున్నారు.



Edited, Printed, Published & Owned by PUSALA SRINIVAS, Printed at D.K. Publications,2-3-691/1/A CPL Main Road, Amberpet, Hyderabad and Published # Do.No. 2-2-1075/20/E/1, Opp. Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13. Editor : PUSALA SRINIVAS, RNI. NO. APTEL/2008/26737. Cell: 9603754136, 9949653944 E-mail: dkchaatimpu80@gmail.com